ఈనాడు ఆదివారం
7 సెప్టెంబరు 2025



ఆపరేషన్... మృత్యుంజయ్!



కేకు... సైజు మారింది!

అందుకే ‘లా’ చదువుతున్నా!

అనంతిక సనీల్‌కుమార్... ‘మ్యాడ్’తో తెలుగు తెరపైన మెరిసిందీ కేరళ కుట్టి. ఆ తర్వాత ‘8 వసంతాలు’ అంటూ కుర్రకారు హృదయాలను కొల్లగొట్టేసింది. పక్కింటమ్మాయిలా కనిపిస్తూ.. అందం, నటనే కాదు.. తనలో అంతకుమించిన కళలున్నాయంటోందీ బ్యూటీ. మరి ఆ కబుర్లేంటో విందామా..!



ఆ ఆసక్తితోనే..

పుట్టి పెరిగిందంతా తిరుచ్చూరులోనే. నాకు ఏదైనా కొత్త విషయం నేర్చుకోవాలనే ఆసక్తి ఎక్కువ. అందుకే, అయిదేళ్ల వయసున్నప్పటి నుంచే సంప్రదాయ నృత్యంలో శిక్షణ తీసుకోవడం ప్రారంభించా.

ఆ ప్రతిభ చూసే..

కరోనా లాక్‌డౌన్ సమయంలో నా డాన్స్‌కు సంబంధించిన రీల్స్‌ను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసేదాన్ని. తక్కువ సమయంలోనే ఫాలోవర్లు బాగా పెరిగారు. అలా సినిమా వాళ్ల దృష్టిలో పడ్డా.

అది చూసి షాకయ్యా

‘8 వసంతాలు’ సినిమా ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో స్టేజీపైన చీరకట్టులో నా డాన్స్, మార్షల్ ఆర్ట్స్‌కు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఆ కార్యక్రమం నుంచి ఇంటికెళ్లేలోగానే ఆ క్లిప్ నా వరకూ రావడంతో చాలా షాక్ అయ్యా.

ఇష్టమైన ప్రదేశం

కశ్మీర్.

ఏదో ఒకటి వచ్చి ఉండాలి

అమ్మాయిలు కచ్చితంగా ఏదో ఒక ఆత్మరక్షణ విద్య నేర్చుకుని ఉండాలి. నావరకూ నేను కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించా. కేరళ సంప్రదాయ యుద్ధకళ కలరిపయట్టులోనూ ప్రావీణ్యం ఉంది. కేరళ సంప్రదాయ సంగీత సాధనం ‘చెండా’ వాయించడమూ వచ్చు. ‘వింగ్ చున్’ అనే చైనా యుద్ధ విద్యలోనూ శిక్షణ తీసుకున్నా.

ఇష్టపడితే కష్టం కాదు

‘ఇన్ని నేర్చుకునేందుకు మీకు టైం ఎలా సరిపోతుంది?’ అంటూ అడుగుతుంటారు చాలామంది. ఎప్పుడూ ఏదో ఒకటి నేర్చుకోవడాన్ని ఇష్టపడమని వారికి బదులిస్తుంటా. నేనూ అదే పాటిస్తా.

ఆ చప్పట్లే కోట్లు...

నా దగ్గర ఎన్ని కళలున్నా.. డాన్స్ అంటేనే నాకు ప్రాణం. నా స్టెప్స్‌ను మెచ్చుకుంటూ అభిమానులు కొట్టే చప్పట్లకు మించిన ఆనందం మరోటి లేదు.

ఎంత భయపడ్డానో...

తమిళంలో నా రెండో సినిమా ‘లాల్ సలామ్’లో రజనీకాంత్‌గారితో చేసే అవకాశం దక్కింది. అంతపెద్ద స్టార్‌తో కలిసి నటించేందుకు భయపడిపోయా. ఆయన సింప్లిసిటీ, ఆప్యాయత చూసి కాస్త ధైర్యం తెచ్చుకున్నా.

అర్థం చేసుకున్నారు

ప్లస్ 2 చదువుతూనే ఇంటికీ, షూటింగ్ లొకేషన్లకూ చక్కర్లు కొట్టేదాన్ని. దాంతో తరగతులకు హాజరు కాలేకపోయేదాన్ని. టీచర్లే నా పరిస్థితిని అర్థం చేసుకున్నారు. సినిమా షూటింగులూ, వాటి ప్రమోషన్ల కోసం సెలవు పెడితే.. స్పెషల్ క్లాసులు చెప్పేవారు.

అమ్మానాన్నలు కంగారుపడ్డారు

మొదట్లో సినిమాల్లోకి రావాలా వద్దా అని చాలా ఆలోచించా. ఇండస్ట్రీలో తెలిసిన వారెవరూ లేకపోవడంతో అమ్మానాన్నలూ కంగారు పడ్డారు. ఆ తర్వాత నేనే కాస్త అవగాహన పెంచుకుని, ఓ ప్రయత్నమైతే చేసి చూస్తానని చెప్పడంతో సరేనన్నారు. కానీ, తమిళంలో నేను నటించిన మొదటి సినిమా రిలీజ్ కాకపోవడంతో డీలాపడిపోయా. అప్పుడు అమ్మే ధైర్యం చెప్పింది. దాంతో తెలుగు సినిమా ‘రాజమండ్రి రోజ్ మిల్క్’లో అవకాశం రావడంతో అంగీకరించా. అదీ విడుదలకు నోచుకోలేదు. ఆ తర్వాత చేసిన ‘మ్యాడ్’తో నాకంటూ ఓ గుర్తింపు వచ్చింది.



గర్వపడేలా చేసింది

మొదట్లో చేసిన సినిమాలు విడుదల కాకపోవడం, ఆ తర్వాత చేసినవి నాకు అంతగా గుర్తింపు ఇవ్వకపోవడంతో నిరాశపడ్డా. ఇక సినిమాలు చేయకూడదనుకున్నా. కానీ, అమ్మాయిని కీలక పాత్రలో చూపే కథ కావడం.. ఆ పాత్ర చుట్టూనే సాగే సినిమా అవ్వడంతో... ‘8 వసంతాలు’ చేశా. ఎటువంటి ఆడిషన్ లేకుండా.. కేవలం నా ప్రతిభ చూసే అవకాశం ఇచ్చామని దర్శకుడు చెప్పడం మర్చిపోలేను. అంతేకాదు.. ‘నేను నటిని’ అని గర్వంగా చెప్పుకునేలా చేసిందా చిత్రం.

అందుకే ‘లా’ చదువుతున్నా

నాకు రాజకీయాలంటే ఆసక్తి. అక్కడ అడుగుపెట్టే ముందు మన చట్టాల గురించి తెలుసుకోవాలనుకున్నా. ప్రస్తుతం ‘లా’ చదువుతున్నా.

లోపల

మంచిమాట

నీ ప్రవర్తన విషయంలో నువ్వు శ్రద్ధ వహించు, గౌరవ మర్యాదలు అవే నిన్ను వెతుక్కుంటూ వస్తాయి.

పావుగంట అయ్యింది!

భర్త: పావుగంట క్రితం టీ అడిగితే ఇప్పుడొచ్చి కళ్లద్దాలు ఇస్తున్నావ్, ఇంతకీ టీ ఏం చేశావ్?

భార్య: టీ తెచ్చి మీ పక్కన పెట్టి పది నిమిషాలు అయ్యింది. కళ్లజోడు పెట్టుకుంటే అయినా కనిపిస్తుందని...

★ ★ ★

రవి: పూజ గదిలో ఉండాల్సిన 'గంట'... అలా ఫ్రిజ్‌లో పెట్టావేంటీ?

రమ: ఫ్రూట్ సలాడ్ చెయ్యడం అయ్యాక ఓ 'గంట' ఫ్రిజ్‌లో పెట్టమన్నాడండీ ఆ యాంకరూ... అందుకే!

మన సామెత

తాడు చాలదని బావి పూడుస్తారా?



సిల్లీ పాయింట్

సింగపూర్‌లో 21 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ అవయవ దాతగా నమోదు చేసుకోవాల్సిందే. కొన్నేళ్ల క్రితం అవయవ మార్పిడికి దాతలు లేక ఆ దేశంలో చాలా ఇబ్బంది ఏర్పడిందట. దాంతో అక్కడి ప్రభుత్వం అవయవ దానాన్ని తప్పనిసరి చేస్తూ చట్టం చేసింది.

★ ఎనిమిది గంటల పని విధానం అమలు వెనక ఎంతోమంది పోరాటం ఉన్నా, మొట్టమొదటగా దీన్ని ప్రతిపాదించింది మాత్రం బ్రిటన్‌కు చెందిన పారిశ్రామికవేత్త రాబర్ట్ అవెన్. అంతేకాదు... 1817లో తన టెక్స్‌టైల్ మిల్లులో పనిచేసే కార్మికులకు '8 గంటల పని... 8 గంటల వ్యాపకం(రిక్రియేషన్)... 8 గంటల విశ్రాంతి' విధానాన్ని అమలు చేసి మార్గదర్శకుడిగా నిలిచారాయన.

★ సినిమా థియేటర్లో సౌండ్స్ బాగా వినిపించాలంటే- సరిగ్గా మధ్యనున్న సీట్లలో కూర్చోవాలట. సినిమా పూర్తయ్యాక, ఆడియో టెక్నీషియన్స్ అందరూ ఫైనల్ ప్రింట్‌ని అక్కడే కూర్చొని చూసేందుకు ఇదే కారణం.

★ కాస్త అటూఇటూగా 1804వ సంవత్సరానికి ప్రపంచ జనాభా వంద కోట్లకు చేరుకుంది. అయితే, తొలి వంద కోట్లకు అన్నేళ్లు పడితే... ఇప్పుడు ప్రతి 12 నుంచి 15 ఏళ్లకు ప్రపంచ జనాభాకు వంద కోట్ల మంది జతవుతున్నారట.

★ డానీ ట్రెజో అనే హాలీవుడ్ నటుడు సినిమా అంగీకరిస్తూ చేసే ఒప్పందంలో ఒక నిబంధన పెట్టేవాడట. తాను విలన్‌గా చేసే చిత్రాల్లో- ఆ పాత్రను సినిమాలో చంపేయాలనేది దాని సారాంశం. ఎందుకూ అంటే... తప్పు చేస్తే కచ్చితంగా శిక్ష అనుభవించాల్సిందేనన్న సందేశాన్ని ప్రేక్షకులకు ఇచ్చేందుకట.

★ ఒత్తిడినీ, ఆందోళననూ అధిగమించేందుకు జపాన్ ప్రజలు అడవుల బాట పడుతుంటారట. 'ఫారెస్ట్ బేతింగ్' అని పిలిచే ఈ థెరపీలో పచ్చని చెట్ల మధ్య స్వచ్ఛమైన గాలి, వెలుతురు, ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరుతారు.



భారీ పరిమాణంలో ఉండే కూరగాయలకు అమెరికాలోని అలస్కా పెట్టింది పేరు. అక్కడ మధ్యాహ్న సమయం ఎక్కువ ఉండటంతో సూర్యరశ్మి బాగా తగిలి, మొక్కల ఎదుగుదల సాధారణం కంటే అధికంగా ఉంటుందట. అందుకే వాటి కాపూ అసాధారణమే!



వియత్నాంలోని 'హాంగ్ సన్ డూంగ్' గుహ ప్రపంచంలోనే అతిపెద్దది. దాదాపు తొమ్మిది కిలోమీటర్ల పొడవుండే ఈ గుహ లోపల ఓ పెద్ద అడవితో పాటు నది కూడా ఉందట.



జపాన్‌లో అతిగా మద్యం తాగి రభస చేసే వారిని పట్టుకెళ్లేందుకు అక్కడి పోలీసులు పరుపులా మెత్తగా ఉండే ఓ పెద్ద సంచీని వాడుతుంటారు.



హుడెడ్ పితోహుయి... ప్రపంచంలోనే విషపూరిత ఏకైక పక్షి జాతి ఇది. న్యూ గినియాలోనే కనిపిస్తాయివి. వీటి రెక్కలూ, చర్మంపైన హానికర రసాయన పదార్థాలు ఉంటాయట.



కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని పశ్చిమ కనుమల్లో మాత్రమే పెరిగే నీలికురింజి మొక్కలు ప్రతి 12 ఏళ్లకోసారి మాత్రమే పూస్తుంటాయి.

కుక్కల విశ్వాసం, మనుషులతో వాటికి ఉండే అనుబంధానికి గుర్తుగా నేపాల్‌లో 'కుకుర్ తీహార్' పేరిట ఏటా అక్టోబరులో పండగ నిర్వహిస్తుంటారు. ఆరోజున పెంపుడు కుక్కలతోపాటు వీధి శునకాలకూ నుదుట బొట్టు పెట్టి, మెడలో పూల దండ వేస్తారు. ఆ తర్వాత వాటికి మాంసం, పాలు తదితర పదార్థాలతో విందు భోజనం పెడతారు.





మీరెప్పుడైనా గమనించారా... చాలావరకూ కార్టూన్ పాత్రల చేతులకు నాలుగు వేళ్లే ఉంటాయి. ఎందుకంటే... అయిదు కంటే నాలుగు వేళ్లను గీయడం, వాటిని యానిమేట్ చేయడం తేలిక కావడమే!



ఈ ఆలయంలో అర్చకులు ఉండరు!

భగవంతుడు కోరేది భక్తిని మాత్రమే. అందుకే ఈ ఆలయంలో ఎత్తయిన రాజగోపురాలు కనిపించవు. అర్చకులూ ఉండరు. అంతేనా... ఇక్కడకు వచ్చే భక్తులు నచ్చినన్ని రోజులు స్వామి సన్నిధిలోనే గడపొచ్చు. అడుగడుగునా ఆధ్యాత్మికత ఉట్టిపడుతూ... ప్రకృతి - పరమాత్ముడు ఒకటేనని నిరూపించేలా నిర్మించిన ఈ ఆలయం పేరూ కాస్త విచిత్రంగానే ఉంటుంది... 'ఆర్గానిక్ కృష్ణ మందిరం'. ఓ ఐఐటీ పూర్వ విద్యార్థి నిర్మించిన ఈ ఆలయం అందమైన గోకులాన్ని తలపిస్తుంది.



వెంకటేశ్వర్లు



ఆహ్లాదకరమైన వాతావరణంలో... ఎక్కడ చూసినా పచ్చని చెట్లతో నందన వనాన్ని తలపిస్తుంది ఆర్గానిక్ కృష్ణ మందిరం. జగన్నాటక సూత్రధారి అయిన కృష్ణ పరమాత్ముడు మురళీలోలుడిగా పూజలు అందుకుంటున్న ఈ ఆలయం నల్గొండ జిల్లా చిట్యాలకు సుమారు పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. స్వచ్ఛమైన భక్తి ఒక్కటే అసలైన కృష్ణతత్వమని ఆస్తిక లోకానికి తెలియజేయాలనే సదుద్దేశంతో రూపుదిద్దుకున్న ఈ ఆలయం వెనుక ఆసక్తికరమైన కథ ఉంది.

శ్రీకారం ఇలా...

హైదరాబాద్‌కు చెందిన పానుగుల్ల వెంకటేశ్వర్లుది వ్యవసాయ కుటుంబ నేపథ్యం. ఐఐటీ గువాహటి నుంచి మాస్టర్స్ పూర్తిచేశాడు. ఆ తర్వాత పీహెచ్‌డీ చేయడం ఆరంభించినా దాన్ని మధ్యలోనే వదిలేశాడు. కృష్ణుడిపైన భక్తి పెరగడంతో ద్వారక, పూరి, ఉడుపి, మథుర, బృందావన్...ఇలా దేశవ్యాప్తంగా ఉన్న పలు కృష్ణమందిరాలకు వెళ్లాడు. ఎందరో స్వామీజీలతో మాట్లాడాడు. ఆ సమయంలోనే ఓ సాధువు ద్వారా అసలైన కృష్ణ తత్వాన్ని అర్థంచేసుకున్నాడు. ఆ నందనందనుడు ఎవరినుంచైనా కోరేది స్వచ్ఛమైన భక్తి, శరణాగతి మాత్రమేనని తెలుసుకున్నాడు. ఆ విషయాలను నలుగురికీ చెప్పాలనే ఉద్దేశంతో ఆ సాధువు సలహాతోనే పదేళ్లక్రితం ఓ చిన్న ఆలయాన్ని నిర్మించాడు. ఏళ్లు గడిచేకొద్దీ తనతో కలిసి చదువుకున్న ఐఐటీ స్నేహితులూ, మరికొందరు దాతల సాయంతో ఇంకాస్త విస్తరించాడు.




ఉచితంగా బస, భోజనం

ఇది కృష్ణమందిరమైనా దూరం నుంచి చూస్తే... ఓ తోట మాదిరి కనిపిస్తుంది. గేటు దాటి లోపలికి వెళ్తే దాదాపు రెండువందల చెట్లూ, పూల మొక్కలూ భక్తుల్ని ఆకట్టుకుంటాయి. అవన్నీ చూస్తూ ముందుకెళ్తే చిన్న గోపురం నీడన శ్రీకృష్ణుడు వేణుగోపాలుడి రూపంలో దర్శనం ఇస్తాడు. ఇక్కడ అర్చకులు ఎవరూ ఉండరు గనుక, భక్తులే స్వయంగా స్వామిని పూజించుకోవచ్చు. అలాగే వినాయకుడు, సరస్వతీదేవి, హనుమంతుడు, సుబ్రహ్మణ్యస్వామి మూర్తులనూ దర్శించుకోవచ్చు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణమంతా తిరుగుతూ నచ్చినంతసేపు గడపొచ్చు. కావాలంటే నాలుగైదు రోజులవరకూ ఇక్కడే ఉండొచ్చు కూడా. వారికోసం రెండుపూటలా భోజనం వండి పెట్టేందుకూ, ఇతర అవసరాలు చూసేందుకూ ప్రత్యేకంగా సహాయకులూ ఉంటారు. పైగా ఈ సదుపాయాలన్నింటినీ ఉచితంగానే అందిస్తారు. 'నిజానికి ఈ ఆలయానికి ఆర్గానిక్ కృష్ణమందిరం అని పేరు పెట్టడం వెనుక కారణం లేకపోలేదు. ప్రకృతీ భగవంతుడూ ఒక్కటేననీ, భక్తికి అసలైన నిర్వచనం ఆడంబరాలు కాదనీ చాటాలనుకున్నాం. ఆ ఉద్దేశంతోనే ఈ ఆలయాన్ని చాలా సింపుల్‌గా నిర్మించినా క్రమంగా రెండున్నర ఎకరాలకు విస్తరించాం. ఇక్కడకు వచ్చేవారు భక్తితో ఒక్క పువ్వు పెట్టినా స్వామి కరుణిస్తాడని తెలియజేసేందుకే అర్చకుల్నీ ఏర్పాటు చేయలేదు. ఇక, బిజీ జీవితం నుంచి బ్రేక్ తీసుకుని, కాస్త ఆహ్లాదకరమైన వాతావరణంలో హాయిగా సేద తీరాలనుకునేవాళ్లెవరైనా ఇక్కడకు రావొచ్చు. అలాగే వాళ్లు కోరుకున్నన్ని రోజులు ఇక్కడ విశ్రాంతి తీసుకునేందుకు ఆలయ ప్రాంగణంలోనే ఆరు గదుల్ని ఏర్పాటు చేశాం. వేళకు శాకాహార భోజనాన్నీ అందిస్తాం. ఇందుకు అవసరమయ్యే ఖర్చంతా పూర్తిగా మాదే. అందుకే నేను ఆర్నెల్లు ఉద్యోగం చేస్తూ ఆర్నెల్లు ఆలయ పనుల్ని చూసుకుంటా. ఐఐటీ గువాహటితోపాటు ఐఐటీ మద్రాస్‌లో నాతోపాటు చదువుకున్న కొందరు స్నేహితులూ సహకరిస్తున్నారు...' అని చెప్పే వెంకటేశ్వర్లు విద్యార్థులకు కెమిస్ట్రీ బోధిస్తాడు. ఇక్కడ రోజువారీ చేసే పూజలతోపాటుగా ప్రత్యేక పర్వదినాల్లో విశేషమైన ఉత్సవాలనీ నిర్వహిస్తారు. ప్రధానంగా ఫాల్గుణమాసంలో వచ్చే పౌర్ణమినాడు.. స్వామివారికి చేసే సంపూర్ణ కల్యాణాన్ని చూసి తరించాల్సిందే. ఈ వేడుకను కృష్ణుడి ఎనిమిది మంది భార్యలతో కలిపి నిర్వహించడం విశేషం.

ఇలా చేరుకోవచ్చు

ఈ ఆలయానికి బస్సు మార్గంలో రావాలనుకునేవారు... హైదరాబాద్ ఎల్బీనగర్ నుంచి విజయవాడ హైవే మీదుగా నల్గొండలోని చిట్యాలకు చేరుకోవాలి. అక్కడినుంచి ఆటోలు అందుబాటులో ఉంటాయి. ★

పరిశోధన



సృజన ఇంట్లోనూ ఉండాలి...!

పనిలో ఎంతో సామర్థ్యం కనబరుస్తారు. చక్కటి సృజన చూపిస్తారు. సహోద్యోగుల మధ్య తిరుగులేని సమన్వయం సాధిస్తారు... ఇన్ని చేసేవాళ్లు ఇంటికొచ్చేసరికి అవన్నీ మానేస్తారు. ఏ వైవిధ్యాన్నీ కోరుకోరు... మూస జీవితమే గడిపేస్తారు. మనలో చాలామందిలో ఉన్న సమస్య ఇది. అలా కాకుండా ఇంటి పనుల్లోనూ కాస్త సృజన చూపగలిగినవాళ్లు... అటు ఉద్యోగంలోనూ ఇటు సంసారంలోనూ అద్భుతాలే చేస్తున్నారని చెబుతోంది ఈ అధ్యయనం. ఇంగ్లండులోని బాత్ యూనివర్సిటీ పరిశోధకులు దీన్ని నిర్వహించారు. ఇందుకోసం సుమారు రెండువందలమంది- ఉద్యోగస్తులైన దంపతుల్ని ఎంచుకుని అధ్యయనం చేశారు. పిల్లల హోమ్‌వర్క్‌లు షెడ్యూల్ వేయడం, వాళ్లని ఎవరు ఎప్పుడు స్కూల్లో దింపాలో ఎలా తీసుకురావాలో టైంటేబుల్ వేయడం, వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తుంటే అందుకు తగ్గట్టు ఇంట్లోని వాతావరణాన్ని మార్చుకోవడం... వీటన్నింటినీ ఎప్పుడూ ఒకేలా చేయకుండా అవసరాన్ని బట్టో వైవిధ్యం కోసమో మారుస్తూ ఉండాలని చెబుతున్నారు అధ్యయనకర్తలు. దీన్నే 'ఫ్యామిలీ క్రియేటివిటీ' అంటున్నారు. ఇది సాధించినవాళ్లు ఉద్యోగంలోనూ మరింత సృజనాత్మకంగా ఉండగలుగుతున్నారనీ మిగతావాళ్లకన్నా కెరీర్‌లో దూసుకెళుతున్నారనీ చెబుతున్నారు.

నోటి బ్యాక్టీరియాతో హృద్రోగం!




చెడు కొవ్వులున్న పదార్థాలకి దూరంగా ఉండటం, రోజూ ఏదో ఒక వ్యాయామం చేయడం, తాగుడూ ధూమపానాల్లాంటివి లేకపోవడం ఇవన్నీ గుండెకి మేలు చేస్తాయని తెలుసు మనకు. ఆ జాబితాలో 'రోజూ రెండుసార్లు బ్రష్ చేయడాన్నీ చేర్చుకోండి' అంటున్నారు ఫిన్‌లాండ్‌లోని తాంపెరే వర్సిటీ శాస్త్రవేత్తలు. ఇంతకాలం పిప్పి పళ్లూ ఇతర ఇన్‌ఫెక్షన్‌ల కారణంగా శరీరంలో వాపు స్వభావం(ఇన్‌ఫ్లమేషన్) పెరగడమే హృద్రోగాలకి 'పరోక్ష' కారణమని శాస్త్రవేత్తలు భావిస్తూ వచ్చారు. కానీ, మన నోటిలోని 'స్ట్రెప్టోకాకస్ విరిడాన్స్' అనే బ్యాక్టీరియా గుండె పోటుకి 'ప్రత్యక్షంగానే' కారణమవుతోందని గుర్తించారు తాంపెరే వర్సిటీ శాస్త్రవేత్తలు. ఇది నోటి నుంచి రక్తంలోకి వెళ్లి... ఆ తర్వాత గుండెకి వెళ్లే బృహద్ధమనికి చేరుతోందట. అందులో పగుళ్లకి కారణమై... ఇన్‌ఫెక్షన్‌లతో పూర్తిగా పూడుకుపోయేలా చేసి... చివరికి గుండె పోటుకి దారితీస్తోందట. గుండెపోటుతో హఠాన్మరణానికి గురైన ఐదువేలమందిలో బృహద్ధమనిని పరిశీలించి ఈ విషయం చెబుతున్నారు తాంపెరే శాస్త్రవేత్తలు.

జుట్టు అలంకరణప్పుడు...



జుట్టు మెత్తగా కావడానికి కండిషనర్... అది ఒత్తుగా మారడానికి సీరమ్... శిరోజాలు మనం చెప్పినట్టు వినడానికి స్ప్రేలు... వాటిని నచ్చినట్టు మార్చుకోవడానికి హెయిర్ డ్రైయర్‌లు మీరూ వాడుతున్నారా! అయితే... వీటితో వచ్చే అతిసూక్ష్మ రసాయన అణువులు ఊపిరితిత్తులు, కాలేయ, కిడ్నీ వ్యాధులకి దారితీస్తున్నాయని హెచ్చరిస్తోంది ఓ పరిశోధన. ఈ రసాయనాలతో 20 నిమిషాలపాటు శిరోజాలంకరణ చేసుకోవడమన్నది... 200 గంటలపాటు రద్దీ రోడ్డుమీద వాహనాల కాలుష్యాన్ని పీల్చడంతో సమానమని చెబుతోంది. అమెరికాలోని పర్డ్యూ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. జుట్టు అలంకరణలో వాడే స్ప్రేలూ, కండిషనర్ వంటి వాటిల్లో సిలాక్సేన్ అనే రసాయనం ఉంటుంది. అది గది ఉష్ణోగ్రత వద్ద 100 నానోమీటర్లకన్నా సూక్ష్మంగా మారి ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోతుంది. ఇదొక సమస్య. జుట్టుపైన ఈ రసాయనాన్ని వాడిన తర్వాత... హెయిర్ డ్రైయర్ వాడితే అవి మరింత సూక్ష్మ అణువులుగా (సుమారు 10 వేల నుంచి లక్ష నానో పార్టికల్స్‌గా) మారిపోయి శరీరంలోకి వెళ్లిపోతాయట. వ్యాధి కారకాలుగా మారతాయట. అలంకరణ కోసం చక్కటి వెంటిలేషన్ ఉన్న గదినే ఎంచుకోవడం, ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లు లేదా ఎయిర్ ప్యూరిఫయర్‌లు వాడటం వల్ల కొంతవరకూ ఈ దుష్ప్రభావాన్ని తగ్గించొచ్చని చెబుతున్నారు పరిశోధకులు.

నిద్రకి యోగా మంచిదేగా



వ్యాయామం చేస్తే నిద్ర బాగా పడుతుందన్నది మనందరిలోనూ ఉన్న నమ్మకం! అదీ జిమ్‌లో ఎంత బాగా శ్రమిస్తే... నిద్ర అంత గాఢంగా ఉంటుందనీ భావిస్తుంటాం. అది ఒట్టి అపోహనని కొట్టిపారేస్తున్నారు చైనాలోని బీజింగ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. నిద్రలేమికి శ్రమతో కూడిన వ్యాయామాలకన్నా... తేలికపాటి వ్యాయామాలే బాగా పనిచేస్తాయని వాళ్లు అంటున్నారు. ఇందుకోసం నిద్రలేమి సమస్యతో బాధపడుతున్న సుమారు పదిహేను వందల మందిని ఎంచుకుని వాళ్ల చేత రకరకాల వ్యాయామాలు చేయించారు పరిశోధకులు. మూణ్నెళ్ల తర్వాత పరిశీలిస్తే... మిగతా అన్ని వ్యాయామాలకన్నా యోగానే నిద్రలేమికి బాగా ఉపయోగపడుతోందని తేల్చారు. అది ఆ సమస్య బాధితులకి రెండు గంటలపాటు గాఢనిద్రని ఇవ్వగలుగుతోందట. శ్వాసపైన ధ్యాస నిలుపుతూ చేయడం, శరీరంలోని ప్రతి భాగంపైనా దృష్టిపెట్టేలా చేయడం వంటివి ఇందుకు కారణం కావొచ్చని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. యోగా తర్వాత చైనాకి చెందిన 'తాయ్ చి' వ్యాయామం మంచిదట. ఇది కనీసం 52 నిమిషాలపాటు గాఢనిద్రకి హామీ ఇస్తోందట. ఈ రెండింటి స్థాయిలోకాకున్నా నడక, జాగింగ్ కూడా నిద్రకి ఎంతోకొంత మేలు చేస్తున్నాయని చెబుతున్నారు. కఠిన శ్రమతో కూడుకున్న వ్యాయామం శరీరాన్ని అలసిపోయేట్టు చేస్తుంది తప్ప... గాఢ నిద్రని ఇవ్వడం లేదని అంటున్నారు.





కరణ్ బజాజ్... 'వైట్‌హ్యాట్ జూనియర్' అనే ఎడ్‌టెక్ కంపెనీ పెట్టి ఏడాదిన్నర కాలంలో రెండువేల కోట్ల రూపాయలు సంపాదించిన యువ పారిశ్రామికవేత్త. ఆ డబ్బుతో రెండేళ్లకిందట ఓ స్వచ్ఛంద సంస్థని పెట్టాడతను. 'లీప్ 300' అన్నది దాని పేరు. '300 రోజుల్లో నిరుపేదల్ని దారిద్ర్యం నుంచి బయటపడేస్తాం' అన్నది దాని నినాదం. ఏడాది తర్వాత- అలా 375 కుటుంబాలని బయటపడేశాం అని ప్రకటించిందా సంస్థ. 'అది సాధ్యమేనా?' అన్న అనుమానం వచ్చింది ప్రముఖ విద్యాసంస్థ బిట్స్ పిలానీకి. ఆయా గ్రామాలకెళ్లి క్షుణ్ణంగా అధ్యయనం నిర్వహించింది. అదేం చెప్పిందంటే...

300 రోజుల్లో... పేదరికం మాయం!





తేతారి దేవి భర్త మూడేళ్ల కిందట ఓ ప్రమాదంలో చనిపోయాడు. వారం తిరక్కుండానే ఆమె మామగారూ కన్నుమూశారు. ఇంట్లో పెద్ద దిక్కు ఎవరూ లేకుండా ముగ్గురు పసిపిల్లలతో ఒంటరిగా మిగిలింది తేతారి దేవి. ఆ పసివాళ్లకి కలోగంజో పోయాలని కూలీగా మారింది. పొలం పనులకెళితే రోజుకి వందరూపాయలు ఇచ్చేవారు. పిల్లల ఆలనాపాలనా చూడటానికి అది సరిపోక... కటిక దారిద్ర్యంలో కూరుకుపోయింది. అప్పుడే ఆమె ఇంటికి 'లీప్ 300' సభ్యులు వచ్చారు. కేవలం ఏడు నిమిషాల్లోనే 'మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' కార్యక్రమానికి ఎంపిక చేశారు.

రెండోరోజే రూ.10 వేలు తన అకౌంట్‌లో వేసి... ఫ్యాన్సీ షాపు పెట్టమన్నారు. తేతారి దేవి అప్పటిదాకా వాళ్ల టౌన్‌లోని మార్కెట్‌కీ వెళ్లి ఎరగదు... కొత్త వాళ్లతో ఎలా మాట్లాడాలో తెలియదు. 'మరి నేను వ్యాపారం ఎలా చేస్తాను?' అన్న భయం ఆమెని పీడిస్తే... అందుక్కావాల్సిన శిక్షణనీ వారంపాటు 'లీప్ 300' సభ్యులే ఇచ్చారు. శిక్షణ పూర్తయిన రోజే రూ.50 వేలు తన అకౌంట్‌లో వేశారు. తను ఎలా వ్యాపారం చేస్తుందో రోజువారీ గమనిస్తూ... సహాయ సహకారాలు అందిస్తూ వచ్చారు. అలా ఏడాది గడిచింది. ఇప్పుడు తేతారి దేవి ఉత్తర్‌ప్రదేశ్, చందౌలి జిల్లాలోని వాళ్ల గ్రామంలో... ఫ్యాన్సీ షాపుతో నెలకి రూ.30 వేలు సంపాదిస్తోంది. పిల్లలు ప్రైవేటు స్కూల్లో చదువుతున్నారు! పక్కనే కూల్‌డ్రింక్స్ షాపూ నడుపుతోంది... చుట్టూ ఉన్న ఆడవాళ్లకి తలలో నాలుకైంది!

- ఇలా ఒకటీ రెండూ కాదు, గత రెండేళ్లలో దాదాపు పదివేలమంది జీవితాలు... 375 కుటుంబాలు... 'లీప్ 300' కార్యక్రమం ద్వారా బాగుపడ్డాయని తేల్చింది దానిపైన అధ్యయనం చేసిన బిట్స్ పిలానీ సంస్థ. బిట్స్ ప్రొఫెసర్ మృదుల్ నేతృత్వంలో బృందం మూడునెలల పాటు ఈ గ్రామాల్లో తిరిగి ఈ అధ్యయనం నిర్వహించింది. ఊరికే గణాంకాలతో 'మమ' అనిపించకుండా... ఆ కుటుంబాల్లోని పిల్లలు పోషకాహారం తీసుకునే తీరునీ, వాళ్ల స్కూలు హాజర్లనీ పరిగణించే ఈ ప్రగతిని అంచనా వేసింది. పిల్లల పోషకాహారం 50 శాతం, స్కూలు హాజరు 30 శాతం పెరిగిందని తేల్చింది. ఇంటింటి పొదుపు 150 శాతం వృద్ధిని అందుకుందని ప్రకటించింది! ఈ సంస్థ పెట్టించిన కిరాణా షాపులూ, బ్యూటీపార్లర్‌లూ, మొబైల్ షాపులూ వంద శాతం సమర్థంగా పనిచేస్తున్నాయని తేల్చింది. ఆ రకంగా 'లీప్ 300' కార్యక్రమాన్ని దేశంలోని ఇతర వెనకపడ్డ ప్రాంతాలకూ విస్తరిస్తే మేలని అభిప్రాయపడింది. ముఖ్యంగా దాని రూపకర్త కరణ్ బజాజ్ సరికొత్త ఆలోచనని ప్రత్యేకంగా అభినందించింది.

ఏమిటా కొత్తదనం..?

కరణ్ బజాజ్ 'వైట్‌హ్యాట్ జూనియర్' అనే ఎడ్‌టెక్ కంపెనీ సృష్టికర్త. పిల్లలకి ఆటపాటలతో కోడింగ్ నేర్పించే ఈ సంస్థ... ఏడాదిన్నరలోనే రెండువేల కోట్ల రూపాయల మార్కెట్ విలువ సాధిస్తే... దాన్ని బైజూస్ కొనుగోలు చేసింది. 'నాకు వచ్చిన డబ్బుని కొన్ని ఎన్జీఓలకి దానంగా ఇద్దామనుకున్నాను కానీ... వాళ్లవన్నీ పాత పద్ధతులు. మనం ఇచ్చేదాంట్లో 40 శాతం వాళ్ల నిర్వహణ ఖర్చులకే పోయి... మిగిలిందే లబ్ధిదారులకి వెళుతోందని గమనించాను. ఆధునిక పద్ధతులూ, సాంకేతికతతో ఆ ఖర్చుని భారీగా తగ్గించి పేదలకి మరింత సమర్థంగా సాయం చేయొచ్చనిపించే... 'లీప్ 300' సంస్థని ప్రారంభించాను' అంటాడు కరణ్. మనదేశంలో బాగా వెనకపడ్డ ప్రాంతాలైన ఉత్తర్‌ప్రదేశ్‌లోని చందౌళి, మధ్యప్రదేశ్‌లోని దేవల్ జిల్లాలలో దాని అమలుకి నాంది పలికాడు. ఇందుకోసమే ఓ సరికొత్త యాప్‌ని రూపొందించాడు. ఈ యాప్‌ని తీసుకుని గ్రామాలకి వెళ్లి అక్కడి కుటుంబాల వివరాలూ, వారి పరిస్థితుల్ని నమోదుచేస్తే చాలు... నిమిషాల్లోనే లబ్ధిదారుల్ని ఇది ఎంపిక చేసేస్తుంది. ఇతరత్రా రాతకోతలూ, పక్షపాతాలకి ఇందులో తావు లేదు. అలా ఎంపికై... ప్రత్యక్ష శిక్షణ పూర్తయ్యాక... ఆయా లబ్ధిదారులచేత ఈ యాప్‌ని డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. నిరక్షరాస్యులూ ఉపయోగించేలా రూపొందిన ఆ యాప్ ద్వారా ఎన్జీఓ సభ్యులు- తాము ఉన్నచోటు నుంచే లబ్ధిదారుల రోజువారీ ప్రగతిని అంచనా వేయగలుగుతారు.

ఆ రకంగా కరణ్ బజాజ్ సృష్టించిన 'లీప్ 300'... పేదల్ని ప్రగతి బాట పట్టించడంలో సరికొత్త నమూనాకి శ్రీకారం చుట్టింది. ఆ విజయంతో, దేశవ్యాప్తంగా తన సేవల్ని విస్తరించడానికి సిద్ధమవుతోంది! ★



కొత్త ట్రెండ్

వేడుకల్లో, పూజల్లో కాస్త ప్రత్యేకంగా తయారైతేనే అందం. అందుకే ఆ సమయాల్లో అమ్మాయిలు ఎక్కువగా సంప్రదాయ దుస్తులకే ఓటేస్తారు. వాటికి సరిపోయేలా ఆభరణాలనూ ఎంచుకుంటారు. ఆ అలంకరణ ఇంకాస్త ట్రెండీగా, కొత్తగా కనిపించాలనుకుంటే... వీటినీ ట్రైచేస్తే సరి.



వయ్యారికి ఫోనుబ్యాగు

పేరంటం, పెళ్లి, పూజ, పండగ... సందర్భం ఏదయినా సందడంతా మహిళలదే. ఆ పనుల హడావుడిలో హ్యాండుబ్యాగు, పర్సు లేకుండా తిరగొచ్చు కానీ మొబైల్ ఫోన్‌ను ఏం చేయాలి... ఎక్కడా పెట్టలేం, ఎవరికీ ఇవ్వలేం. పోనీ బ్యాగులో వేసి ఎక్కడైనా పెడదామా అంటే ఎప్పుడే ఫోను వస్తుందో తెలియదు. అందుకే మొబైల్ ఫోన్‌ను చక్కగా నడుముకు పెట్టుకుంటే సరి. అందుకు వీలుగా ఫోను బ్యాగులు హుక్కులతో సహా వస్తున్నాయి. తాళాలగుత్తి మాదిరి అన్నమాట. ఇవన్నీ మహిళలు ఎంతో ఇష్టపడే పసిడి, వెండి వెరైటీల్లో... ముత్యాలూ మువ్వలూ మెరిసే రంగురాళ్ల అందాల్ని అద్దుకుని వస్తూ కనికట్టు చేస్తున్నాయి. స్టెయిన్డ్‌గ్లాస్ మెరుపులతో, ఎంబ్రాయిడరీ హంగులతో, ఆర్ట్‌పీస్ అందాలతో... ఇలా కోరిన డిజైన్లలో దొరుకుతున్నాయి.



శిరోజాలకీ ఉన్నాయి చెయిన్లు

చీర, లంగాఓణీ, చుడీదార్... ఏది వేసుకుంటున్నా జడ అల్లుకోవడం కన్నా తలమధ్యలో చిన్న క్లిప్పు పెట్టుకుని అదనంగా ఒక మూర పూలమాల తురుముకుని జుట్టును అలా గాలికి వదిలేయడమే ఫ్యాషన్ అంటారు ఈతరం అమ్మాయిలు. ఒప్పుకోవాల్సిందే కానీ ఎప్పటికప్పుడు కొత్తగా తయారైతేనే కదా... వెళ్లిన ప్రతిచోటా ట్రెండీ లుక్కుతో ఆకట్టుకునేది. అందుకే ఈసారి ఆ క్లిప్పుల్నీ, పూలమాలల్నీ వదిలేసి ఈ హెయిర్‌చెయిన్లు పెట్టుకుని చూస్తే సరి. సన్నని గొలుసుల్లా కనిపించే ఈ హెయిర్ చెయిన్లు ఒకటి నుంచి రెండు మూడు వరుసల్లో ఉంటాయి. చిన్న చిన్న పూలూ, సన్నని గొలుసులూ, చిట్టిచిట్టి జడబిళ్లలూ.. తదితర డిజైన్లలో వచ్చే ఈ చెయిన్లు తల్లో పెట్టుకునేందుకు క్లిప్పుతో లేదా హుక్కులతో వస్తాయి. పూల జడల్లా మరీ భారీగా, పొడుగ్గా ఉండవు గనుక... పూలమాల మాదిరి పెట్టుకుని మురిసిపోవచ్చు.





ఉంగరాల జత ఉండాల్సిందే!

ఏదైనా వేడుకకి వెళ్ళేటప్పుడు దుస్తులు, లోలాకులు, గాజులు, మెడలో వేసుకునే నగలు, వాచీ.. ఇలా అన్నీ మ్యాచ్ అయ్యేలా చూసుకుంటాం తప్ప ఉంగరాల గురించి పెద్దగా పట్టించుకోం. ఇకపైన మన అలంకరణకు సరిపోయేలా అవీ ట్రెండీగా కనిపించాలని కోరుకుంటే ఈ చెయిన్ అటాచ్డ్ డబుల్ ఫింగర్ రింగ్స్‌ను పెట్టుకుంటే సరి. ఇవీ ఉంగరాలే కానీ వీటిలో ఒకటి పెద్దగా కాక్‌టెయిల్ రింగ్ తరహాలో ఉంటే మరొకటి చిన్నగా వస్తుంది. అలాగే ఈ రెండింటినీ జతచేసేందుకు చెయిన్లు కూడా ఉంటాయి. ఆ చెయిన్లూ ఉంగరాలకు ఏ మాత్రం తీసిపోకుండా నిండుగా ముత్యాలు, మువ్వలు, రంగు రంగుల రాళ్లు, పూసలతో వస్తుండటంతో... అమ్మాయిల అందమైన వేళ్లకు ఇప్పుడు ఈ ఉంగరాల జతే ఓ ఆభరణంలా మారిపోయింది. ఆ డిజైన్లేవో మీరూ చూసేయండోసారి.







ఆపరేషన్... మృత్యుంజయ్!

వైద్యశాస్త్రం తన వైఫల్యాన్ని ఆమోదిస్తుంది. బంధుమిత్రులు నాలుగు కన్నీటి చుక్కలు రాల్చేస్తారు. మనిషిగా హాస్పిటల్‌లోకి వెళ్లినవాడు శవమై బయటికి వచ్చేస్తాడు. మరుక్షణమే, మళ్లీ బతకాలనే అతని చిరకాల వాంఛను నిజం చేసే ప్రయత్నం మొదలైపోతుంది. మృత్యువును గెలిచే వరకూ ఆ ఆశావాది దేహం శిథిలమైపోకుండా సురక్షితమైన వాతావరణంలో భద్రపరుస్తారు నిపుణులు. ఆ ప్రక్రియ పేరే... క్రయోనిక్స్!

పురాణాల్లో... రాక్షసులు తపోబలంతో మృత్యువు కోరల నుంచి తప్పించుకోవాలని చూశారు. అయినా, అంతం తప్పలేదు. ప్రయోగశాలల్లో... శాస్త్రవేత్తలు బుద్ధిబలంతో మరణాన్ని జయించే మార్గాలు అన్వేషిస్తున్నారు. కానీ, ఆ ప్రయత్నంలో మళ్లీ మళ్లీ విఫలం అవుతూనే ఉన్నారు. అయితేనేం, చావును చావుదెబ్బ తీయాలనే కోరిక మాత్రం సజీవంగానే ఉంది. నిజంగానే ఆ కల సాకారమైతే... అప్పటికే దహనమో, ఖననమో జరిగిపోయిన దేహాలన్నీ మళ్లీ బతికే అవకాశాన్ని కోల్పోతాయి. ఆ అదృష్టం చేజారిపోకుండా... మరణం తర్వాత తమ శరీరాల్ని అత్యాధునిక సౌకర్యాల నడుమ జాగ్రత్తగా భద్రపరిచేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు కొంతమంది. ఆ సంరక్షణ విధానం పేరే... 'క్రయోనిక్స్'. గ్రీకు భాషలో 'క్రయో' అంటే శీతలం. 'క్రయోనిక్స్' అంటే... అతి శీతల వాతావరణంలో భద్రపరచడం. అమెరికాకు చెందిన రాబర్ట్ ఎటింగర్ అనే ఫిజిక్స్ ప్రొఫెసర్ యాభై ఏళ్ల క్రితం, ప్రపంచంలోనే మొట్టమొదటి క్రయోనిక్స్ కంపెనీని ప్రారంభించారు. అతని తల్లి, ఇద్దరు భార్యల దేహాలు ఆ ఆవరణలోనే 'విశ్రాంతి' తీసుకుంటున్నాయి. 'ఒక అత్త, ఇద్దరు కోడళ్లూ ఇన్నేళ్లుగా పక్కపక్కనే ఉంటున్నా, ఏ చిన్న గొడవా జరగకపోవడం ఎంత విడ్డూరం! అంతా మృత్యువు మహాత్యం!' అంటూ హాస్యం చేస్తారు నోబెల్ పురస్కార గ్రహీత వెంకీ రామకృష్ణన్ తన 'వై వియ్ డై' పుస్తకంలో. తర్వాత కొంతకాలానికి, ఆ వరుసలో రాబర్ట్ శరీరమూ వచ్చి చేరింది! అప్పటికి ఆయన వయసు తొంభై రెండు. అయినా, జీవితాన్ని జుర్రుకోవాలనే కోరిక తీరలేదేమో.

అక్కడ ఏం చేస్తారు?

శ్వాస నిలిచిపోతుంది. హృదయ స్పందన ఆగిపోతుంది. వైద్యులు 'సారీ..' చెప్పేస్తారు. నర్సులు మొహంమీద తెల్ల దుప్పటి కప్పేస్తారు. బిల్లింగ్ సెక్షన్‌లో లెక్కలు తేల్చేస్తారు. ఆ మరుక్షణం నుంచే 'క్రయోప్రిజర్వేషన్' మొదలైపోతుంది. చాలా సందర్భాల్లో రోగి ఎమర్జెన్సీ వార్డులో ఉండగానే, క్రయోనిక్స్ నిపుణులు హాస్పిటల్‌కు చేరుకుంటారు. మరణ ప్రకటన వెలువడే లోపు... ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటారు. ఈ ప్రక్రియలో మొత్తం మూడు దశలు...

స్టేజ్-1

చట్టపరమైన లాంఛనాలు పూర్తికాగానే, వైద్య నిపుణులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుంటారు. తాత్కాలికంగానే అయినా, కృత్రిమ పద్ధతుల్లో రక్త ప్రసరణనూ శ్వాసనూ పునరుద్ధరిస్తారు. 'బ్లడ్ థిన్నర్స్' ఎక్కిస్తారు. ఎందుకంటే, రక్తం ద్వారా జరిగే ప్రాణవాయువు సరఫరా ఆగిపోతే మెదడు దెబ్బతింటుంది. ఏళ్ల తరబడి సురక్షితంగా భద్రపరచడం కష్టం అవుతుంది.

శ్వాస ఆగిన తర్వాత కూడా, కొంతకాలం పాటూ శరీర కణజాలం సజీవంగా ఉంటుంది. సమయం గడిచేకొద్దీ, క్రమక్రమంగా నిర్జీవంగా మారుతుంది. క్రయోనిక్స్ బృందం ఆ రెండు నష్టాలనూ నివారిస్తుంది.

స్టేజ్-2

మనిషి శరీరంలో సగానికి సగం నీరే. అతిశీతల వాతావరణంలో శవాన్ని భద్రపరిస్తే... శరీరం పూర్తిగా గడ్డకట్టుకుపోతుంది. దీంతో, ఎంతోకొంత ఆరోగ్యంగా ఉన్న భాగాలు కూడా కృశించిపోతాయి. అందుకే క్రయోనిక్స్ ప్రతినిధులు శరీరాన్ని చల్లని నీటిలో ఉంచి, ఒంట్లోని ద్రవ పదార్థాలను మొత్తంగా బయటికి తీసేస్తారు. ఆ స్థానంలో 'క్రయోప్రొటెక్టివ్ ఏజెంట్స్' నింపుతారు. దీనివల్ల శరీరం ఎంత శీతల వాతావరణంలో అయినా గడ్డకట్టుకుపోదు. మహా అయితే, గాజులాంటి స్థితికి చేరుకుంటుంది. దీన్నే 'విట్రిఫికేషన్' అంటారు.

స్టేజ్-3

శరీరాన్ని -200 డిగ్రీల సెల్సియస్ వరకూ క్రమంగా చల్లబరిచిన తర్వాత... చివరగా, లిక్విడ్ నైట్రోజన్ నింపిన ఫ్రీజర్‌లో భద్రపరుస్తారు. ఈ పరికరం పేరు 'క్రయోస్టాట్'. ఇక ఆ దేహాన్ని ఏ సూక్ష్మజీవులూ నాశనం చేయలేవు. వైద్యశాస్త్రం జననమరణాల కోడ్‌ను కనిపెట్టేవరకూ ఆ యథాతథ స్థితి కొనసాగుతుంది.

...అయితే, అన్ని శరీరాలూ క్రయోనిక్స్‌కు పనికిరాకపోవచ్చు. కాలిన గాయాలతో మరణించినవారూ, క్యాన్సర్ తుదిదశలో చనిపోయినవారూ ఇందుకు అనర్హులు. అప్పటికే శరీరంలో చాలాభాగం నష్టపోయి ఉంటుంది కాబట్టి, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎక్కువకాలం కాపాడుకోలేరు.

ఎంతకాలం ఇలా?

శీతల పేటికలోని దేహానికి మళ్లీ మునుపటి కళ తీసుకురావడం ఏమంత సులభం కాదు. ముందుగా, నిర్జీవ కణజాలాన్ని బతికించాలి. మెదడుకు ఆలోచననూ, జ్ఞాపకశక్తినీ ఇవ్వాలి. శరీరంలోకి కొత్త రక్తం ఎక్కించాలి. గుండె, కాలేయం, మూత్రపిండాలు మొదలైన కీలక భాగాల్ని పునఃసృష్టించాలి. చర్మానికి కొత్త మెరుపులు అద్దాలి. ఇప్పటి వరకూ ఆ దిశగా మనం సాధించింది నామమాత్రమే. అంతా అనుకున్నట్టుగానే జరిగితే, 2045 నాటికి

మనిషి మరణంపైన పైచేయి సాధించడం ఖాయమని అంటారు ప్రఖ్యాత కంప్యూటర్ సైంటిస్ట్ రే కుర్జ్‌వీల్. 'అయినా, ఇలా అవయవాలు మార్చగలమని ఊహించామా? ఇన్ని ప్రాణాంతక వ్యాధులకు వ్యాక్సీన్లు కనిపెడతామని కలగన్నామా?... అవన్నీ వీలైనప్పుడు, ఇది మాత్రం ఎందుకు కుదరదు?' అన్నది ఆయన వాదన. ఇదే నమ్మకంతోనే విశ్వకుబేరుడు జెఫ్ బెజోస్ అమరత్వ రహస్యాన్ని కనిపెట్టడానికి వేలకోట్లు వెచ్చిస్తున్నాడు. త్వరలోనే అందుబాటులోకి రానున్న నానో మెడిసిన్‌తో శరీరంలోని మృతకణాల్ని బతికించడం సాధ్యమేనని వైద్య ప్రపంచం గట్టిగా నమ్ముతోంది. అవయవాల పునఃసృష్టి కోసం త్రీడీ ఆర్గాన్ బయో ప్రింటింగ్ పైన పెద్ద ఆశలు పెట్టుకుంది. మృతుడి శరీరంలో ఎంతోకొంత ఆరోగ్యంగా ఉన్న కణాలకు నకలును తీసి కొత్త అవయవాల్ని తయారు చేయడం సాధ్యమేననే వాదన కూడా వినిపిస్తోంది. అవసరమైతే, క్లోనింగ్ టెక్నాలజీ సాయం తీసుకోడానికి కూడా శాస్త్రవేత్తలు సిద్ధంగా ఉన్నారు. తల నుంచి పాదాల వరకూ... అన్నీ సవ్యంగా ఉన్నంత మాత్రాన, మనిషి బతికినట్టు కాదు. ఆ శరీరానికి ప్రాణశక్తిని ప్రసాదించాలి. జీవం పోయాలి. ఇదే, మన ముందున్న అతిపెద్ద సవాలు. ఆ ఫార్ములాను కనిపెట్టాకే, శీతల పేటికల్లోని దేహాలకు శాశ్వత విముక్తి.

మెదడు ఒక్కటే సరిపోతుందా?

'మనిషి అంటే... పైపైకి కనిపించే భౌతిక శరీరం కానేకాదు. అతని ఆలోచనలూ జ్ఞాపకాలూ అనుభవాలూ మాత్రమే' అని బలంగా నమ్మేవారూ ఉన్నారు. అలాంటి వారంతా... మృతుడి జ్ఞాపకాల భాండాగారం అయిన మెదడును మిగతా శరీరం నుంచి వేరుచేసి, క్రయోనిక్స్ ద్వారా కాపాడుకుంటే చాలని వాదిస్తారు. అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చాక... మెదడులోని సమాచారాన్ని సూపర్ కంప్యూటర్‌ను తలదన్నే సరికొత్త పరికరంలో డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుందన్నది వాళ్ల అభిప్రాయం. అదే కనుక సాధ్యమైతే... మనిషి బుర్రతో, యంత్ర శరీరంతో ఓ కొత్త 'ప్రాణి' పుట్టుకొస్తుంది. దానికి ఆహారం అవసరం లేదు. ఆక్సిజన్‌తో నిమిత్తం ఉండదు. ఇక మరణమే సంభవించదు. ఇదోరకమైన 'మానసిక అమరత్వం'! 'కనెక్టోమిక్స్'గా వ్యవహరించే ఆధునిక శాస్త్ర విజ్ఞానంతో మెదడులోని న్యూరాన్ల మధ్య కనెక్షన్లను మ్యాపింగ్ చేయడం ద్వారా బ్రెయిన్ రీకన్‌స్ట్రక్షన్ కల నిజం అవుతుందని శాస్త్రవేత్తల నమ్మకం. 'ఆ రోజు కూడా దగ్గర్లోనే ఉంది. మెదడు డిజిటలైజేషన్ నా జీవితకాలంలోనే జరిగి తీరుతుంది' అని చెబుతారు ఓపెన్ ఏఐ సహ వ్యవస్థాపకుడు సామ్ ఆల్ట్‌మన్.

ఎంత ఖర్చవుతుంది?

క్రయోస్టాక్స్‌లోని దేహాల్ని ఏళ్లకు ఏళ్లు పరిరక్షించడమంటే ఖరీదైన వ్యవహారమే. అందుకు తగ్గట్టుగానే రుసుములూ ఉంటాయి. అమెరికాలో అయితే, భారతీయ కరెన్సీ ప్రకారం... మొత్తం శరీరానికి రూ.2 కోట్ల వరకూ, మెదడుకు మాత్రమే అయితే, రూ.80 లక్షల వరకూ వసూలు చేస్తారు. ఇది 'జీవితకాల' సభ్యత్వం. అమెరికాతో పోలిస్తే రష్యా, చైనా లాంటి చోట్ల ఈ సేవలు కొంత చవకే. ఒకేసారి అంత డబ్బు చెల్లించడం కష్టం అనుకునేవారు, ప్రత్యేక బీమా పాలసీలు తీసుకుంటున్నారు. నిర్ణీత ప్రీమియం చెల్లిస్తే... పాలసీదారుడి ఊపిరి ఆగిపోయాక, బీమా డబ్బు క్రయోనిక్స్ కంపెనీలకు వెళ్లిపోతుంది. మార్ట్‌గేజ్ విధానంలో ఆస్తిపాస్తుల్ని కుదువ పెట్టుకుని అప్పులు కూడా ఇస్తున్నారు. ఏదో ఒక రోజు ప్రాణం తిరిగొస్తుందని బలంగా నమ్మేవారు, ఆ కల నిజమైన తర్వాత ఎలా జీవించాలి? ఉద్యోగాలు వెతుక్కుంటూ వీధుల్లో తిరగాలా? అయినా, అంత ఖర్చు పెట్టిందీ చేతిలో చిల్లిగవ్వ లేని దరిద్రపుగొట్టు జీవితం కోసమా? దీనికి కూడా ఓ పరిష్కారం ఉంది. రెండో జీవితం కోసం 'రివైవల్ ట్రస్ట్' ఏర్పాటు చేసుకుని, ఓ భారీ మొత్తాన్ని పక్కన పెడుతున్నవారూ ఉన్నారు. ఆ డబ్బు పక్కదారి పట్టకుండా చూసేందుకూ, పొదుపు-మదుపు ద్వారా రెట్టింపు చేసేందుకూ, ప్రస్తుత వారసుల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా కాపలా కాసేందుకూ... కొన్ని ప్రత్యేక కంపెనీలు పుట్టుకొస్తున్నాయి. ఏదో ఓ సమయానికి

మరణానికి ముందే...

శరీరాన్ని భద్రపరిచే ప్రక్రియను మరణం తర్వాత మొదలుపెట్టడం కంటే, కొన ఊపిరితో ఉన్నప్పుడు ఆరంభిస్తే ఫలితాలు బావుంటాయనే వాదనా ఉంది. అంటే, ఎప్పుడో బతకడం కోసం, ఇప్పుడే చావడం అన్నమాట! కాకపోతే, ఈ ప్రక్రియకు చట్టపరమైన పరిమితులు ఉన్నాయి. నైతికంగానూ ఇబ్బందికరమైన వ్యవహారమే. ఇదంతా 'అసిస్టెడ్ సూసైడ్' పరిధిలోకి వస్తుంది. పరిమితులకు లోబడి, కాలిఫోర్నియా లాంటి చోట్ల మాత్రం అనుమతులు లభించే అవకాశం ఉంది. మరీ నిక్షేపంగా ఉన్నప్పుడు కాకుండా, మరణానికి కొన్ని క్షణాల ముందు తమ శరీరాన్ని నిపుణుల బృందానికి అప్పగించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నవారూ ఉన్నారు. అలాంటి వారి కోసం క్రయోనిక్స్ ఆవరణల్లోనే వృద్ధాశ్రమాలూ, హాస్పిస్ సేవలూ అందుబాటులోకి వస్తున్నాయి.

జంతువుల కోసమూ...

ఏదో ఒకరోజు తామే కాదు... తమ పెంపుడు పిల్లులూ, కుక్కలూ కూడా మళ్లీ ప్రాణం నింపుకోవాలని ఆరాటపడేవారి సంఖ్యా తక్కువేం కాదు. అందుకు, ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అలాంటి జంతుప్రేమికుల కోసమే యానిమల్ క్రయోనిక్స్ వెలుస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఐదొందల మూగజీవాలు... శీతల పేటికల్ని చేరాయి. వాటిని భద్రపరిచే విధానం కూడా మనుషుల 'క్రయోప్రిజర్వేషన్'ను పోలి ఉంటుంది. అమెరికాలో 'క్రయోపెట్'లాంటి సంస్థలు ఈ సేవల్ని అందిస్తున్నాయి. ఆ ప్రాణి ఎత్తునూ, బరువునూ బట్టి సంరక్షణ వ్యయాలు మారిపోతాయి. ఇక్కడ కూడా 'మెదడు మాత్రమే' ఆప్షన్ ఉంది.



ఆ 'శవాలు' ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలో కనిపించినా ఆశ్చర్యపడాల్సిన పన్లేదు.

ఇప్పటి వరకూ ఎంతమంది?

ఐదు దశాబ్దాల క్రితమే ప్రారంభమైనా, క్రయోనిక్స్ సేవలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. అత్యాధునిక వైద్య ఆవిష్కరణలు మనిషిలో అమరత్వం పట్ల కొత్త ఆశలు రేకెత్తించడం ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతానికి అమెరికా, రష్యా, చైనా, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్ మొదలైన చోట్ల మాత్రమే ఈ సౌకర్యాలు లభిస్తున్నాయి. భారత్‌లో ఇంకా అందుబాటులోకి రాలేదు. ఆల్కర్ లైఫ్ ఎక్స్‌టెన్షన్ ఫౌండేషన్, క్రయోనిక్స్ ఇన్‌స్టిట్యూట్ అమెరికాలో పేరున్న సంస్థలు. ఆల్కర్‌లో రెండొందల యాభై వరకూ, క్రయోనిక్స్ ఇన్‌స్టిట్యూట్‌లో రెండొందల వరకూ, రష్యాలోని 'క్రయోరస్'లో వంద వరకూ దేహాలు తీపి కబురు కోసం ఎదురుచూస్తున్నాయి. తుదిశ్వాస తర్వాత, క్రయోనిక్స్‌లో కాస్తంత చోటు కోసం ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసుకున్నవారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా పది నుంచి పాతికవేల వరకూ ఉండొచ్చని అంచనా. ప్రజల్లోని ఆ ఆసక్తి ఆంత్రప్రెన్యూర్లకు కొత్త వ్యాపార అవకాశాన్ని అందిస్తోంది. 'స్పోర్ట్స్ కారు ధర చెల్లించండి... మళ్లీ బతకండి' అంటూ ప్రకటనలు హోరెత్తిస్తోంది 'టుమారో.బయో' అనే జర్మన్ స్టార్టప్. ఇప్పటికే ఈ సంస్థలో ఎనిమిది వందలమంది వరకూ పేర్లు నమోదు చేసుకున్నారు.

తమ సంగతి ఎలా ఉన్నా... తమవాళ్లు మాత్రం తిరిగి బతకాలని ఆకాంక్షించేవారూ అక్కడక్కడా ఉన్నారు. థాయ్‌లాండ్‌లోని ఓ సెంటర్‌లో రెండేళ్ల పసిబిడ్డ శరీరం మనిషి మృత్యువును గెలిచే శుభ తరుణం కోసం పదేళ్ల నుంచీ ఎదురుచూస్తోంది. ఆ చిన్నారి తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లే. చిట్టితల్లిని హఠాత్తుగా ప్రాణాంతక రుగ్మతలు చుట్టుముట్టాయి. అమ్మానాన్నలు స్వహస్తాలతో శస్త్ర చికిత్సలు చేశారు. అయినా, బిడ్డ ప్రాణాలను నిలబెట్టలేక పోయారు. భవిష్యత్తులో ఏదో ఓ అద్భుతం జరగకపోతుందా... విధి తన తీర్పును సవరించుకోక పోతుందా అనే ఆశకొద్దీ ఆ దంపతులు ఓ క్రయోనిక్స్ కంపెనీని ఆశ్రయించారు. ఆ చిన్నారి పేటిక పక్కనే ఉన్న తొంభై అయిదేళ్ల పండు ముదుసలి శరీరమూ ఇంకొంతకాలం జీవితాన్ని ఆస్వాదించాలని ఆరాటపడుతోంది. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌తో మరణించిన స్టీఫెన్ కోల్స్ అనే ప్రొఫెసర్ తన మెదడును మాత్రమే భద్రపరిచేలా బతికున్నప్పుడే

అమెరికాలోని పేరున్న క్రయోనిక్స్



సెంటర్‌తో ఒప్పందం చేసుకున్నాడు. మాటిచ్చినట్టుగానే 'న్యూరోసెపరేషన్' ద్వారా ఆయన మెదడును వేరు చేసి భద్రంగా దాచిపెట్టారిక్కడ. అన్నట్టు, క్రయోనిక్స్ ఆవరణల్లో 'శవం' అనే మాట నిషిద్ధం. ఎవరినోటా వినిపించదు, ఏ రికార్డుల్లోనూ కనిపించదు. 'క్రయో పేషెంట్' అని మాత్రమే పిలుస్తారు. మృతదేహాల 'శాశ్వత' నిద్రను 'క్రయో స్లీప్'గా వ్యవహరిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా అమలులో ఉన్న చట్టాలు మాత్రం ఆ దేహాల్ని శవాలుగానే పరిగణిస్తాయి. క్రయోనిక్స్ కేంద్రాల్ని కూడా శ్మశానాల కిందే జమకడతాయి. కాకపోతే, అవన్నీ ఆశావాదుల శ్మశాన వాటికలు!

ఈ ప్రశ్నకు బదులేదీ?

అంతా అనుకున్నట్టే జరుగుతుందని భావిద్దాం. సమీప భవిష్యత్తులో మనిషిని బతికించడం, పడుకున్నవారిని నిద్రలేపినంత సులభమని ఊహిద్దాం. అలా అని, అక్కడితో కథకు 'శుభం' కార్డు పడినట్టు కాదు. ఆ తర్వాత తలెత్తే నైతికమైన, న్యాయపరమైన సమస్యలకూ పరిష్కారాలు కనిపెట్టాలి. ఉదాహరణకు.... 1950లో పుట్టిన ఓ వ్యక్తి, 2025లో తన డెబ్భై అయిదేళ్ల వయసులో మరణిస్తాడు. అతని శరీరాన్ని ఏ క్రయోనిక్స్ సెంటర్‌లోనో భద్రపరుస్తారు. మొత్తానికి, 2050 నాటికి శాస్త్రవేత్తలు చావు రహస్యాన్ని కనిపెడతారు. ఆ ఆవిష్కరణ ఫలితంగా అతను మళ్లీ బతికితే.... బర్త్ సర్టిఫికెట్ ఇస్తారా, రీ-బర్త్ సర్టిఫికెట్ ఇస్తారా? అయినా, జవసత్వాలు కోల్పోయిన ఆ ఏడుపదుల శరీరంతో అతనేం సాధిస్తాడు, కొత్త జీవితాన్ని ఎలా ఆస్వాదిస్తాడు? అసలు, చచ్చి బతికిన మనుషుల్ని సమాజం ఆమోదిస్తుందా? పాత జీవితంలోని పిల్లల్నో, పిల్లల పిల్లల్నో అతని వారసులుగా గుర్తిస్తారా?... ఇలా ఎన్నో సందేహాలు.

శరీర భాగాలు కూడా...

క్రయోప్రిజర్వేషన్... క్రయోనిక్స్ స్ఫూర్తితో ప్రాణం పోసుకుంటున్న రేపటి ఆవిష్కరణ. దశాబ్దాల పాటూ మొత్తంగా మనిషి శరీరాన్ని భద్రపరచడం వీలైనప్పుడు... మూత్రపిండాలు, కాలేయం, గుండె మొదలైన ముఖ్య అవయవాల్ని మాత్రం రేపటి అవసరాల కోసం నిల్వ చేయలేమా? ఇప్పటి వరకూ 'బ్రెయిన్ డెడ్' వ్యక్తుల కీలక అవయవాల్నే మార్పిడికి ఉపయోగిస్తున్నారు. అదీ కొద్ది గంటల్లోపే. భవిష్యత్తులో ఆ సమస్య ఉండకపోవచ్చు. ప్రతి సహజ మరణమూ ఎవరో ఒకరికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది. ప్రయోగ దశలో... ఎలుక మరణించగానే, దాన్ని క్రయోనిక్స్ ద్వారా భద్రపరిచి, వంద రోజుల తర్వాత... మృత మూషికం మూత్రపిండాల్ని మరో ఎలుకకు అమర్చగలిగారు శాస్త్రవేత్తలు. క్రయో ప్రిజర్వేషన్‌ను మనుషులకూ అన్వయించే రోజు దగ్గర్లోనే ఉందేమో.

జననమరణాల చక్రం... సజావుగా సాగినంత కాలమే ప్రకృతిలో సమతౌల్యం. మరణాలు ఆగిపోయి, జననాలు మాత్రమే సాగిపోతే... జనాభా విస్ఫోటనం సంభవించే ప్రమాదం ఉంది. తీవ్ర ఆహార కొరత రావచ్చు, ఉపాధి అవకాశాలు తగ్గిపోవచ్చు. ఈ సంక్షోభాన్ని ప్రభుత్వాలు ఎలా ఎదుర్కొంటాయో మరి! కాలమే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ప్రతి ఆవిష్కరణతోపాటూ పుట్టుకొచ్చే ఉత్పాతాల్ని సంబాళించుకోవడం కాలానికి కొత్తేం కాదు.

★ ★ ★

ప్రచ్ఛన్న యుద్ధాల కాలం ముగిసి పోయింది. వియత్నాం పోరు ఆగిపోయింది. గల్ఫ్ సంక్షోభం సమసిపోయింది. వాటర్‌గేట్ కుంభకోణం అమెరికాను కుదిపేసింది. సోవియట్ యూనియన్ ముక్కలైంది. ఉగ్రవాదుల దాడిలో ట్విన్ టవర్స్ కుప్పకూలాయి. ఎయిడ్స్, కరోనా ఉక్కిరిబిక్కిరి చేశాయి. వైద్య రంగంలోనూ ఎన్నో ఆవిష్కరణలు జరిగాయి. యాభై ఎనిమిదేళ్ల నుంచీ అమెరికాలోని ఓ క్రయోనిక్స్ సెంటర్‌లో 'భలే మంచి రోజు' కోసం ఎదురుచూస్తున్న డాక్టర్ జేమ్స్ బెడ్‌ఫోర్డ్ కోరిక మాత్రం ఇంకా తీరలేదు. బతకడానికే కాదు, చచ్చి బతకడానికి కూడా ఆశావాదం అవసరమే! ★

అవీ ఇవీ



పాప కోసం...

పోటెత్తిన వరద నీరు... బండరాళ్ల మధ్య నుంచి మహావేగంతో సాగిపోతూ, చూస్తుంటేనే వెన్నులో వణుకు పుట్టించేలా ఉంది కదా ఈ చిత్రం. కానీ 40 ఏళ్ల కమల మాత్రం... అవేమీ ఆలోచించకుండా బ్యాక్‌ప్యాక్ అటూఇటూ కదలకుండా గట్టిగా వీపుకి కట్టుకుంది. కాళ్లకున్న చెప్పులని చేతుల్లోకి తీసుకుంది. ఒక్కసారిగా ఆ బండరాళ్లపైకి దూకింది. వర్షాలకి పాకుడుతో నిండిన ఆ బండరాళ్లపైన నిలబడటమే కష్టమైనా దానిపైకి దూకి పట్టుసాధించింది. ఆ రాయి నుంచి మరొక రాయిపైకి దూకింది. అలాఅలా అవతలివైపుకు చేరుకుంది. ఇదంతా చూసి.... ఆమె ఏ 'రీల్స్'కోసమో ఈ సాహసం చేస్తుందేమో అనుకుంటే పొరపాటు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మాండ్యా జిల్లాలో ఉన్న సుధార్ ప్రాంతంలో కమల ఆరోగ్యకార్యకర్తగా పనిచేస్తోంది. అక్కడ వరద బీభత్సం పెరగడంతో కొండ చరియలు విరిగిపడతాయేమోనన్న భయంతో అధికారులు రోడ్లని ఎక్కడికక్కడ బ్లాక్ చేశారు. ఆ సమయంలోనే నదికి అవతల ఉన్న ఓ గ్రామంలో అప్పుడే పుట్టిన పాపాయికి వ్యాక్సినేషన్ కావాలని కమలకి ఫోన్ రావడంతో, తన ప్రాణాలని సైతం లెక్క చేయకుండా ఇలాంటి సాహసం చేసి ఆ పాపాయికి వ్యాక్సిన్ వేసింది. ఒక పసి ప్రాణాన్ని కాపాడటం కోసం ఆమె చూపిన తెగువకి దేశవ్యాప్తంగా అనేక మంది ప్రశంసిస్తున్నారు.



భర్తల కోసం బడులు!

ఆఫ్రికాలోని సెనెగల్‌లో... 20 పాఠశాలలు ఉంటే, వాటిలో 300 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఎక్కడైనా బడులు ఉంటాయి, ఉపాధ్యాయులూ ఉంటారు... ఇందులో కొత్తగా చెప్పుకోవడానికి ఏముందీ అంటారా? అదేంటంటే- ఈ పాఠశాలలకి ఓ ప్రత్యేకత ఉంది. ఇవన్నీ కూడా మంచి భర్తలని తయారుచేసే బడులు. ఇక్కడ శిక్షణ తీసుకున్న విద్యార్థులు- అదేనండీ భర్తలు- ఇంటి పనుల్లో భార్యలకి సాయం చేయాలి, పిల్లలకి స్నానం చేయించాలి, అన్నం తినిపించాలి, వాళ్లని ఆడించాలి, ఇల్లు తుడవాలి. ఇదేదో ఆ దేశ ఆచారమో, సంస్కృతిలో భాగమో కాదు. గతంలో ఈ దేశంలో మాతాశిశు మరణాలు చాలా ఎక్కువగా ఉండేవి. మగవాళ్లు బాధ్యతారాహిత్యంగా ఉండటం, స్త్రీల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వంటివే ఇందుకు కారణం. దాంతో డబ్ల్యూహెచ్‌వో స్వయంగా కలగచేసుకుని మగవాళ్లలో స్త్రీల ఆరోగ్యం, కుటుంబ పనిభారం వంటివాటి పట్ల అవగాహన పెరిగేలా ఈ స్కూళ్లని ప్రారంభించింది. ఇబ్రహీం డయానే అనే మతపెద్ద ఆధ్వర్యంలో ఈ స్కూళ్లు నడుస్తున్నాయి. ఆయన దగ్గర శిక్షణ పొందిన వాళ్లు ఉపాధ్యాయులుగా ఉండి మరికొంతమందిని మంచి భర్తలుగా తీర్చిదిద్దుతూ ఉంటారు. ఈ స్కూళ్లు మొదలయ్యాక మాతాశిశు మరణాల రేటు బాగా తగ్గిందని అంటున్నారు.

మనుషులకు తోకలు...

కోతులకీ, పులులకీ, సింహాలకీ తోకలుంటాయి... మరి మనుషులకి కూడా ఉంటే? 'మనుషులకి తోకలు ఉంటే ఎలా ఉంటారో...' అన్న ఊహే మనకి నవ్వు తెప్పిస్తుంది కానీ, జపాన్ శాస్త్రవేత్తలు మాత్రం మనుషులకు తోకలు తగిలించడంపైన పెద్దఎత్తునే పరిశోధనలు చేస్తున్నారు. అవును, కోతులూ పిల్లులూ వంటి వాటికి తోక ఉండటం వల్లనే అవి పరుగు పెట్టినప్పుడూ, వేటాడినప్పుడూ, గోడలు దూకినప్పుడూ పడిపోకుండా బ్యాలెన్స్ చేసుకోగలుగుతాయి. మరోపక్క మనుషుల్లోనూ వయసు పెరిగేకొద్దీ కండరాల పటుత్వం తగ్గిపోయి, తరచూ తూలిపడుతూ ఉంటారు. అలా కాకుండా ఉండటానికి 'ఆర్క్యూ' పేరుతో ఒక రోబోటిక్ తోకని ఆవిష్కరించారు శాస్త్రవేత్తలు. చిన్న బెల్ట్ సాయంతో నడుముకి కట్టుకోవడానికి వీలుగా దీనిని రూపొందించారు. జపాన్‌లో వందేళ్లు పైబడిన వృద్ధుల సంఖ్య పెరుగుతూ ఉండటంతో ఇలాంటి ఆవిష్కరణలు చేయాల్సి వస్తోందట. అయితే ఈ ఆర్క్యూ తోకలు ఒక్క పెద్దవాళ్లకే కాదు, కొన్ని రంగాల్లో పనిచేసే కార్మికులకూ, వర్చువల్ గేమ్స్ వంటివి ఆడేవారికీ కూడా ఉపయోగపడతాయట.



చెత్త ఇస్తే... భోజనం ఫ్రీ!


భోపాల్‌లోని ఒక హోటల్ పేరు కచరా కేఫ్... 'చెత్త హోటల్' అని దానర్థం. పోయిపోయి ఎవరైనా హోటల్‌కి అలాంటి పేరుపెట్టుకుంటారా అనేగా మీ సందేహం. భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్ 10- నంబర్ మార్కెట్ ప్రాంతంలో మొదలుపెట్టిన ఈ కేఫ్ లక్ష్యమే వేరు. ఇక్కడ టిఫిన్ తినాలన్నా, భోజనం చేయాలన్నా డబ్బులు ఖర్చుపెట్టాల్సిన పని లేదు. పాత న్యూస్‌పేపర్లూ, కార్డ్‌బోర్డులూ, విరిగిన ఛార్జర్లూ, ప్లాస్టిక్ బాటిళ్లూ... ఇలా, ఏమి ఇచ్చినా తీసుకుని వాటి బరువుని తూస్తారు. అంత మొత్తానికి చెత్త ఇచ్చిన వాళ్ల ఫోన్‌లో 'కచరా కరెన్సీ'ని జమ చేస్తారు. ఆ డబ్బులతో ఆ కేఫ్‌లో దొరికే టీ, టిఫిన్లూ, లేదా స్టేషనరీ వస్తువులూ, పచారీ సరకులూ వంటివి కొనుక్కోవచ్చు... కాకపోతే ఒక షరతు! ప్లాస్టిక్, కాగితం, ఎలక్ట్రానిక్స్... అన్నింటినీ కలిపి ఇవ్వకూడదు, వేటికవే వేరుచేసి మాత్రమే ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల ప్రతి ఒక్కరికీ చెత్తని రీసైక్లింగ్ చేయడంపైన అవగాహన పెరుగుతుందని అంటున్నారు భోపాల్ అధికారులు. త్వరలోనే ఈ తరహా కేఫ్‌లని ఇతర ప్రాంతాల్లోనూ తీసుకొస్తారట.





గాజులాంటి చెక్క... వచ్చేస్తోంది!

మీ ఫోన్ టచ్‌స్క్రీన్‌ని గ్లాస్‌తో కాకుండా చెక్కతో తయారు చేస్తే ఎలా ఉంటుంది? కార్ డాష్‌బోర్డుని ప్లాస్టిక్‌తో కాకుండా ఒక్కసారి ఉడ్‌తో ఊహించుకోండి! చెక్కతో చేసిన తలుపులు ఓకే, ఫర్నిచర్ డబుల్ ఓకే... కానీ ఎలక్ట్రానిక్స్, టచ్‌స్క్రీన్ లాంటివాటిని చెక్కతో ఊహించడం కాస్త కష్టమే అంటారా...'ట్రాన్స్‌పరంట్ ఉడ్'తో ఇవన్నీ సాధ్యం అవుతున్నాయి మరి...!







చెట్టుని కొట్టకుండా ఆ చెట్టు కాండం- అదే చెక్క లోపల ఏముందో తెలుసుకోవాలనుకున్నాడు ఫింక్ అనే జర్మనీ వృక్ష శాస్త్రవేత్త. ఆ క్రమంలోనే 'సీ త్రూ ఉడ్' - అంటే గాజులా కనిపించే పారదర్శక చెక్క ఉంటే బాగుంటుంది కదా అనుకున్నాడు. ఈ ఆలోచన ఇప్పటిది కాదు... ముప్ఫైఏళ్ల క్రితానిది. అప్పట్నుంచి మొదలుపెడితే ఇప్పటికి ఆ ఆలోచన ఆచరణలోకి వచ్చింది. స్కై స్క్రాపర్స్ లేదా ఆకాశహర్మ్యాల నిర్మాణంలో వాడే అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌లో ఈ ట్రాన్స్‌పరంట్ లేదా సీ త్రూ ఉడ్‌నే ప్రధానంగా వాడుతున్నారు. వీటినే ఎందుకు వాడుతున్నారో చూద్దాం.

రంగు మారింది...

చెక్క అనగానే మనకి ఏ అంశాలు గుర్తుకొస్తాయి? కాస్త అటూఇటూగా ఉండే దాని ముదురు, లేత గోధుమ వర్ణాలు... బలంగా, బరువుగా ఉండి ఏళ్లపాటు ఉండే దాని మన్నిక. అందుకేగా... శతాబ్దాలుగా చెక్కకి ఇంటీరియర్ డెకరేషన్‌లో అంత ప్రాధాన్యతనిస్తూ వచ్చాం. అయితే గాజు, ప్లాస్టిక్ వచ్చాక చెక్క స్థాయి కాస్త తగ్గిందనే చెప్పాలి. పారదర్శకంగా కనిపించడం, తేలికగా ఉండటం వంటి కారణాలతో వాటి వినియోగం పెరుగుతూ వచ్చింది. ఇవే ప్రత్యేకతలు చెక్కకూ ఆపాదిస్తే ఎలా ఉంటుందని ఆలోచించిన శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు చేసి, రెండేళ్ల క్రితమే 'ట్రాన్స్‌పరంట్ ఉడ్'కి ప్రాణం పోశారు. ఇది చూడ్డానికి గాజులా కనిపిస్తూ, ప్లాస్టిక్‌లా తేలికగా ఉంటుంది. అవును, చెక్కకి ఆ రంగుని తీసుకొచ్చే 'లిగ్నిన్' అనే ప్రత్యేక పదార్థాన్ని బ్లీచింగ్ ద్వారా తొలగించారు. ఇక మిగిలిన ఆ చెక్కలో కొన్ని సహజ పాలిమర్లని నింపి ఈ అద్దంలాంటి చెక్కకి రూపమిచ్చారు. సంప్రదాయ చెక్కతో పోలిస్తే తేలిగ్గా ఉండటం, రెట్టింపు దృఢంగా ఉండటం దీని ప్రత్యేకతలు. ఇవి మాత్రమే కాదు ఈ రకం చెక్కతో ఇతరత్రా ప్రయోజనాలూ బోలెడున్నాయి. ఈ సీ త్రూ ఉడ్ గాజు, ప్లాస్టిక్ మాదిరిగా కాకుండా తేలిగ్గా భూమిలో కలిసిపోతుంది, పైగా వాటితో పోలిస్తే పదిరెట్లు బలంగా ఉంటుంది. గాజులా పెళుసుగా ఉండదు, చెప్పినట్టుగా వింటుంది. అందుకే దీనిని భవన నిర్మాణాల్లో 'అడ్వాన్స్‌డ్ మెటీరియల్'గా ఉపయోగిస్తున్నారు. సహజంగానే ఏ చెక్కకైనా వేడినీ, చల్లదనాన్నీ అడ్డుకునే గుణం ఉంటుంది... ఇప్పుడు వీటికి వెలుతురుని ప్రసరింపజేసే గుణమూ తోడవ్వడంతో ఇంజినీర్లూ, ఆర్కిటెక్ట్‌లూ పెద్దపెద్ద భవంతుల నిర్మాణంలో కిటికీలూ, గోడల స్థానంలో ఈ చెక్కనే ఉపయోగిస్తున్నారు. ఈ చెక్కవల్ల కృత్రిమ కాంతిపైన ఎక్కువగా ఆధారపడాల్సిన అవసరం లేదనీ, దీంతో విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చనీ శాస్త్రవేత్తలు అంటున్నారు.



ఎలక్ట్రానిక్ వస్తువుల్లోనూ...

ఫోన్లు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్ వినియోగం పెరగడమే కానీ ఎక్కడా తగ్గుతున్నట్టు లేదు కదా! దాంతో పాటు ప్లాస్టిక్ వినియోగమూ పెరుగుతోంది. ఓ పట్టాన భూమిలో కరగని ఈ ఎలక్ట్రానిక్ వ్యర్థాలని తగ్గించేందుకు ఈ సరికొత్త ట్రాన్స్‌పరంట్ ఉడ్ బాగా ఉపయోగపడుతుందట. పలుచగా, పారదర్శకంగా ఉండే ఈ చెక్కని ఫోన్లపైన టచ్ స్క్రీన్‌గానూ, కార్లల్లో డాష్ బోర్డులుగానూ, సోలార్ ప్యానెల్స్‌లోనూ వాడటం మొదలుపెట్టారు. స్వీడన్‌కి చెందిన సెల్యుటెక్ ఏబీ, అమెరికాకు చెందిన ఇన్వెంట్ ఉడ్, ఫ్రాన్స్‌కు చెందిన ఊడూ డచ్, హాలాండ్ కాంపోజిట్స్, కేటీహెచ్ రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి సంస్థలన్నీ ఈ పారదర్శక చెక్కని పెద్ద ఎత్తునే తయారుచేస్తున్నాయి. ఇక, మన దేశం విషయానికొస్తే చెక్కని నూటికి నూరుశాతం పారదర్శకంగా కనిపించేలా చేయడానికి ఐఐటీ వారణాసి సహా బెంగళూరు, అసోంలోని కొన్ని స్టార్టప్ కంపెనీలు గుడ్డులోని తెల్ల సొననీ, బియ్యాన్నీ వాడి మరింత నాణ్యమైన చెక్కని తయారుచేస్తున్నాయి. కొన్ని రోజులు ఆగితే ఈ గాజుచెక్క ఫర్నిచర్ మనింట్లోకీ వచ్చేస్తుందన్నమాట. ★









నలుగురు స్నేహితులు ఒక దగ్గర కలిస్తే అదో చిన్న సమావేశమే అవుతుంది, కానీ అందులో కేకు కటింగ్ ఉందంటే మాత్రం కచ్చితంగా అదో సరదా పార్టీ అయిపోతుంది. పుట్టినరోజునాడు చాక్లెట్లు తీసుకెళితే అది కేవలం శుభాకాంక్షలు చెప్పినట్టే ఉంటుంది, కానీ వాటితోపాటు చక్కటి త్రీడీ కేకునూ పట్టుకెళ్లారంటే అది ధూంధాం సెలబ్రేషన్ అవుతుంది. ఇలా సంతోషకరమైన ప్రతి సందర్భాన్నీ రెట్టింపు చేసే గొప్పతనం కేకుకే సొంతం మరి. అందుకే, కామాలే తప్ప ఫుల్‌స్టాపుల్లేకుండా కొత్తకొత్త కేకుట్రెండ్స్ ఎప్పటికప్పుడు అలరిస్తూనే ఉన్నాయి. అందులో భాగంగానే ఈమధ్య కేకు సైజు తగ్గించుకుని బుజ్జిగా వచ్చేసింది. ఆ వెరైటీ ఏంటో మనమూ ఓ లుక్కేద్దామా...

కేకు... సైజు మారింది!

చిన్నారుల నెలనెలా బర్త్‌డే వేడుకలతోనే ఇంట్లో కేకు కటింగ్ సంప్రదాయం మొదలైపోతుంది. ఒక్క పుట్టినరోజులకే కాదు, పరీక్షల్లో పాస్ అయినా, ఉద్యోగం వచ్చినా, పదోన్నతి అందుకున్నా, ఇల్లు కొన్నా, పెళ్లి కుదిరినా, విదేశాలకు వెళుతున్నా... ఇలా జీవితంలోని ఆనందకరమైన సమయాలన్నింటిలోనూ కేకు భాగం అవ్వాల్సిందే. పిల్లల నుంచి పెద్దల వరకూ 'నో' చెప్పని ఈ ఫేవరెట్ బ్రెడ్డు మిఠాయిలో అప్పట్లో మహా అయితే ఓ రెండు మూడు రకాలు మాత్రమే అందుబాటులో ఉంటే- ఇప్పుడు వేనవేల వెరైటీలు వరస కట్టేశాయి. ముచ్చటైన ఐసింగులతో మాయ చేసే అద్భుతమైన ఆకారాల నుంచి కమ్మని రుచులతో నోరూరించే ఫ్లేవర్ల వరకూ లెక్కకు మించి తయారయ్యాయి. బోర్ కొట్టేయకుండా ఎన్నో ఆప్షన్లతో మన ముందుకొస్తున్నాయి. ఇక ఇప్పుడేమో చిట్టి చిట్టి రూపాల్లో, నయా ఆకృతుల్లో దర్శనమిస్తున్నాయి. ఏంటీ వీటి ప్రత్యేకత అంటే...

సైజు తెచ్చిన క్రేజు!

ఒకరికి చాక్లెట్ ఫ్లేవర్ కేకు నచ్చితే, ఇంకొకరికి వెనీలా కావాలి, మరొకరికి రెడ్ వెల్వెట్ అంటే ఇష్టం. అలాంటప్పుడు వేడుకలో ప్రతి ఒక్కరూ తమకిష్టమైన కేకును ఆస్వాదించడానికి వీలు కాదు కదా... ఇంకా కొన్నిసార్లు ఇంట్లో ఉన్న ఇద్దరు వ్యక్తులే సంబరాన్ని జరుపుకోవాలనుకుంటే పెద్ద పెద్ద కేకులు వృథానే అవుతాయి. కేకును కోయడం తమాషాగానే అనిపిస్తుంది కానీ ఆ పెద్ద కేకును ముక్కలుగా కోసి తలా ఒకటి పంచాలంటే మాత్రం కాస్త ఇబ్బందే. అలా కాకుండా ఫంక్షన్లలో అందరికీ నచ్చిన కేకు ఫ్లేవర్లు ఉంటే, వృథా అవ్వకుండా ఇద్దరి కోసమే వస్తే, అసలు కోయాల్సిన పనే లేకుండా నోట్లో పెట్టుకుని తినొచ్చంటే... ఎంత హాయిగా ఉంటుందో కదా! సరిగ్గా అలాంటి వెసులుబాటుని అందించడానికే పుట్టుకొచ్చింది ఈ మినియేచర్ కేకు రకం. అయితే ఇది ఇప్పటికిప్పుడు వచ్చిన ట్రెండ్ ఏమీ కాదు. ఓ మాదిరి సైజులో ఉండే కేకు- కొన్నేళ్ల క్రితం దక్షిణ కొరియా, జపాన్ దేశాల్లో కాస్త తగ్గి, టిఫిన్ బాక్సులో పట్టేంత పరిమాణానికి వచ్చింది. 'బెంటో కేకు' పేరుతో ఈ బుల్లి కేకు చాలా ప్రాంతాల్లో ఫేమస్ అయింది. అటూ ఇటూగా కప్ కేకు సైజులోని ఈ మినీ కేకు అలంకరణా, ఆకృతిలో మాత్రం పెద్ద కేకుల్లానే ఉండి అందర్నీ ఆకట్టుకుంది. ఈ చిన్న సైజుతో ఉన్న లాభాల్ని బాగా గ్రహించిన మాస్టర్ షెఫ్‌లు- ఇంకా ఇంకా చిన్నగా ఒకేసారి గుటుక్కుమనిపించేలా ఇక్కడున్న కొత్త రకం పొట్టి కేకులకి రూపమిచ్చారు.



ఎన్ని రకాలో...

పిల్లలకు ఏదైనా కొత్తగా ఉంటేనే నచ్చుతుంది. కేకు అంటే ఎప్పుడూ కనిపించేలా గుండ్రంగా, ఊహించిన రూపంలోనే ఎందుకు ఉండాలి? బుజ్జాయిలకు ఇష్టమైన లాలీపాప్, ఐస్‌క్రీం ఆకారాల్లోనూ ఉంటే మరింత అదిరిపోదూ! అందుకే చిన్నారుల కోసం ప్రత్యేకంగా కేకు స్టిక్స్, పాప్స్, పాప్సికల్స్ వస్తున్నాయి. ఆయా ఆకారాల్లో అచ్చులూ దొరుకుతున్నాయి. కేకు మిశ్రమాన్ని వాటిల్లో పోస్తూ, అవసరమైన వాటికి స్టిక్స్ పెట్టి వీటిని తయారుచేస్తున్నారు. క్రీమ్, క్రంచీస్, నట్స్‌తో నచ్చినట్టు డెకరేట్ చేస్తున్నారు. చూడ్డానికి గమ్మత్తుగానే కాదు, చేత్తో పట్టుకుని తినడానికి వీలుగా ఉండే ఈ కేకులు చిన్నారుల మనసు దోచుకుంటాయి.





కోన్‌తో కేక్...

'ఐ లవ్యూ' అంటూ ఓ పువ్వుకు బదులు కోన్‌లో ఓ అందమైన రంగుల పూల కేకుని పెట్టి ఇచ్చారంటే- అవతలివాళ్లు మీ క్రియేటివ్ కానుకతో ఫిదా అయిపోరూ! అంతా బాగుంది కానీ కోన్‌లో కేకు ఏంటీ అంటారా... ఈమధ్య కేకు కోన్స్ ట్రెండ్ వచ్చింది. నచ్చిన ఫ్లేవర్లలో, కోరుకున్న ఆకారాల్లో బుల్లి కేకుల్ని చేసి ఇలా కోన్లలో పెట్టి ఇస్తారన్నమాట. ఇవే కాదు, చూడ్డానికి నిజమైనవే అనిపించేలా మాయ చేస్తూ త్రీడీ లుక్కులోనూ ఈ చిట్టి కేకుల్ని తీర్చిదిద్దుతున్నారు. ఫ్రాన్స్‌లో మొదలైన 'పెటీ ఫోర్స్' కేకుల పద్ధతి ఇప్పుడు అన్నిచోట్లా కనిపిస్తోంది. బిస్కెట్లలాంటి కేకులు కూడా భలే ముద్దుగా ఉంటాయి. స్ట్రాబెర్రీ, పైనాపిల్ లాంటి పండ్లూ, క్రీముల్ని కలిపి లేయర్లతో తయారుచేసే షార్ట్‌కేకులూ, స్పాంజీలా ఉండే లోఫ్ కేకులు కూడా చిన్నగా మారిపోయాయి. అంతేనా... రెండు, మూడు అంతస్తుల్లోని లేయర్ కేకుల్నీ అరచేతిలో పట్టేంత సైజుల్లో తీసుకొస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే మామూలు కేకుల్లో వచ్చిన అన్ని రకాల్నీ ఈ మినియేచర్ కేకుల్లో చూపిస్తున్నారు. మెరిసే జెల్లీ కేకులు మొదలు మెత్తటి ఫోమ్ కేకుల వరకూ ప్రతిదీ పొట్టిరూపంలో తెగ మెప్పిస్తోంది ఇప్పుడు.

కానీ ఇలా వేలెడంత సైజుల్లో సరికొత్త ఆకృతుల్ని తీసుకురావడం అంత సులువేం కాదు. నిజానికి పెద్ద కేకుల కన్నా ఎక్కువ శ్రమ పడాలి. కానీ ఈ బుల్లి సైజుతోపాటు వచ్చిన సౌలభ్యాల్ని దృష్టిలో పెట్టుకుని మరిన్ని ప్రయోగాలు చేస్తున్నారు ఫుడ్ లవర్స్.

పార్టీలో ఎంత పెద్ద కేకు అయినా, మరెంత అద్భుతంగా ఉన్న కేకు పెట్టి కట్ చేసినా- దాంతోపాటు టేబుల్ మీద అందంగా వరసల్లో కేక్ పాప్స్, స్టిక్స్, మినీ లేయర్ కేక్స్‌ను పెట్టారంటే- వేరే డెకరేషన్‌తో పనిలేకుండా ఆ ఫుడ్ అలంకరణే అతిథుల్ని అమాంతం కట్టిపడేస్తుంది. రంగుల మెరుపులతో కనులకు విందు చేస్తుంది, నచ్చిన ఫ్లేవర్ ఎంచుకునే ఛాయిస్‌నీ, సులువుగా తినే సౌకర్యాన్నీ అందిస్తుంది.

కేకు డెజర్ట్‌గా పేరు తెచ్చుకుంటూ- ముఖ్యంగా వేడుకల్లో హాట్ స్వీట్ ఫుడ్ ట్రెండ్ అయిన ఈ మినీ కేకులు మీకు నచ్చాయా... మరి ఆలస్యం ఎందుకు, ఓసారి ట్రై చేస్తే పోలే...! ★









త్యాగాజ్జగతి పూజ్యంతే...

– పెమ్మరాజు విజయరామచంద్ర

వెలగని వీధిదీపాల నడుమ నల్లటి పాయలా పాకుతున్న చిక్కటి చీకటిని చీల్చుకుంటూ బైక్ మీద ఇంటికి వచ్చాను. హాల్లోంచి విన్పించే 'ఈటీవీ' వార్తలతో సమయం తొమ్మిదయినట్లు అర్థమైంది. టీవీ ఆగకుండా మోగుతోంది. రిమోట్ టీపాయ్ మీదుంది. 'త్యాగ' అక్కడ లేదు. వంటింట్లోంచి గరిటెల చప్పుడు గట్టిగా వినిపిస్తోంది. షూస్ విప్పి లోపలకి వెళ్ళి చూశాను. ఓ పెద్దావిడ మూకుడులో గబగబా గరిటె తిప్పేస్తోంది. పరిచయంలేని ముఖాన్ని చూసి అవాక్కయ్యాను. వెనకడుగు వేశాను. ఆవిడ నా వైపు తిరిగింది.

"మీరూ..." ఆశ్చర్యంలో ప్రశ్నని కలిపి అడిగాను.

"నా పేరు కాంతమ్మ. వారం క్రితమే పక్క వాటాలోకి అద్దెకొచ్చాం."

'వారానికే వంటింటిదాకా అంటే...' అన్నట్లు పెట్టిన నా మొహం చూస్తే అర్థమైందనుకుంటా.

"పై వాటా లక్ష్మి కోడలికి నొప్పులు వస్తున్నాయని త్యాగ వెళ్ళింది" గ్యాస్ ఆఫ్ చేస్తూ చెప్పింది.

"మంత్రసాని పనికా?" విసుగ్గా అడిగాను.

"నీ కోసం వంట చేసి పెట్టమంటేనూ... ఇదిగో ఇప్పుడే రెండు నిమిషాల్లో టేబుల్ మీద సర్దేస్తా" కుక్కర్ మూత తీసి గబగబా గిన్నెలు టేబుల్ మీద సర్దేసింది.

అసలు త్యాగ ఆలోచనలేమిటో అర్థం కాలేదు. వారంక్రితం పరిచయమైన వాళ్ళకి వంటిల్లు అప్పగించిందంటే, మరో వారానికి బీరువా తాళాలు ఇస్తుందా? కడుపున బిడ్డ పుడితే ఇవ్వన్నీ తగ్గుతాయనుకుంటే, మరో రెండు సంవత్సరాలపాటు పిల్లల్ని కనడం వాయిదా వేసింది.

పెళ్ళికి ముందు అమ్మాయి 'మేలిమి బంగారం' అన్నారు. 'మంచిపిల్ల' అని కితాబు ఇచ్చారు. బంగారమంటే ఇదా? మంచితనమంటే ఇలాగుంటుందా? తనకు మాలిన ధర్మంలో తరించడమే మంచా? మూడేళ్ళ కాపురం రీల్ వెనక్కి తిప్పితే 'జనం, సేవా' అంటూ తిరగడం తప్ప మరేం కనిపించటంలేదు.



మధురమైన రాత్రిని గుర్తు తెచ్చుకుందామంటే, అర్ధరాత్రి వచ్చే ఫోన్లకు పరిగెత్తిన పీడకలలే మనసులోకి వస్తున్నాయి.

"మామయ్య గారూ, మీ వంశానికి మదర్ థెరెసా మూలాలు ఉన్నాయా?" త్యాగవాళ్ళ నాన్నగారిని కలిసినప్పుడు అడిగాను. మొదట ఆయనకు అర్థం కాలేదు.

కాస్త వివరించగానే గట్టిగా నవ్వి "చూడయ్యా, మా అమ్మాయి ఫోన్‌లో రీల్స్ చూస్తూ నిన్ను పట్టించుకోలేదనుకో, 'చెత్త రీల్స్ చూడ్డం తగ్గించమ్మా' అని చెప్పొచ్చు. నీ అవసరాలన్నీ తీరుస్తోందనీ కావలసినవన్నీ సమకూరుస్తోందనీ చెప్పావు. దాంతోపాటు ఇరుగుపొరుగుకి సేవ చేస్తోందనీ మంచిదనే పేరు సంపాదించిందనీ కూడా నువ్వే చెపుతున్నావు. మరి, భగవద్గీత పట్టుకు తిరిగే పిల్లకి బాంబులు విసరమని చెప్పనా? చూడు బాబూ... పెళ్ళాన్ని కావలసినట్లు మలచుకోవడం గొప్ప కళయ్యా, నేర్చుకునేందుకు ప్రయత్నించు" అంటూ సుత్తి ముక్తావళి కొట్టి బుర్ర తిన్నాడు.

పోనీ నాన్నతో గోడు చెపుదామా అంటే, అదే అదనుగా తీసుకుని నన్నూ అమ్మనీ కలిపి మరీ తిట్లరేవు పెట్టేస్తాడు. వంటింట్లోంచి వచ్చిన పాత్రల చప్పుడుకి ఆలోచనలు వదలి వాస్తవంలోకి వచ్చాను.

"నాయనా, గిన్నెలు రేపు ఇస్తానని త్యాగమ్మకి చెప్పు" కూరగిన్నె, సాంబారు గ్లాసు తీసుకుని చకచకా వెళ్ళిపోయింది.

ఇది ఇల్లా... ధర్మసత్రమా..? చికాకుగా అనిపించింది. బట్టలు మార్చుకుని, కాళ్ళూ చేతులూ కడుక్కుని అన్నం తినడం అయిందనిపించుకుని టీవీ చూస్తూ సోఫాలోనే ముడుచుకుని నిద్రపోయాను.

★ ★ ★

తెల్లవారింది. త్యాగ వచ్చిన జాడ లేదు. వీధి గుమ్మం తలుపు తీశాను. అప్పుడే ఆటో దిగి గబగబా లోపలికి వచ్చింది. వస్తూనే వంటింట్లోకి వెళ్ళి పొగలు కక్కుతున్న వేడివేడి కాఫీ కప్పులతో వచ్చి, సోఫాలో కూర్చున్న నాకో కప్పు ఇచ్చి, తను మరో కప్పు తీసుకుని ఎదురుగా కూర్చుంది. వికసించిన మల్లెమొగ్గలా ఉండే త్యాగ రాత్రి నిద్రలేక వాడిపోయిన జాజిపువ్వులా ఉంది. చింతనిప్పుల్లాంటి కళ్ళలో అలసటని దాచే ప్రయత్నం చేస్తోంది.

"పాపం లక్ష్మిగారి కూతురికి కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందండీ. ఆపరేషన్ చేసి బేబీని తీశారు. బేబీ మాత్రం చాలా హెల్దీగా ఉందిలెండి. నొప్పులు పడిపడి అమ్మాయి బాగా నీరసపడింది" పదిమంది పిల్లల్ని కన్న పెద్ద ఆరిందలా చెప్పింది.

"నువ్వు ఎంతమందిని కన్నావేంటీ."

అంత అలసటలోనూ కూడా సిగ్గుపడ్డ త్యాగని చూస్తే కోపం విసుగూ చికాకూ అన్నీ పటాపంచలైపోయాయి.

"లక్ష్మిగారి అక్కచెల్లెళ్ళూ తోటికోడళ్ళూ అందరూ ఇక్కడే చుట్టుపక్కలే ఉంటారు. వాళ్ళమధ్య పంతాలూ పట్టింపులునూ. పిల్ల ప్రసవమంటే ఒక్కరూ రాలేదు. అన్యాయం కదండీ. 'నువ్వు నా పెద్ద కూతురివమ్మా' అంటూ పట్టుకుని ఏడ్చేశారు. పాపం, జాలేసిందండీ" ఆ మాట చెపుతుంటే త్యాగ కళ్ళు చెమర్చడం గమనించాను.

"అన్నట్లు మర్చేపోయాను, నిన్నరాత్రి కాంతమ్మగారి వంట బాగుందా? వంట చేసే

టైమ్ లేక పరిగెత్తాను. ఏం కూర కావాలో చెప్పండి. కూరల పాపమ్మ వచ్చే టైమ్ అయింది. మీకిష్టమైన కూర చేస్తాను"

ఆమె తీసుకునే శ్రద్ధకు మనసులోనే ఆనందపడ్డాను.

"అమ్మగోరూ" కూరగాయల పాపమ్మ పిలుపు మామధ్య సంభాషణను తుంచేసింది. కూరల బుట్ట దించుకుంటుంటే, గంపతోపాటే నెత్తి మీద చుట్టులా పెట్టుకున్న పాతగుడ్డ కిందపడింది. దాన్ని దులిపి పక్కన పెట్టుకుంది.

"వస్తున్నా!" అంటూ ఒక్క ఉదుటున వచ్చింది త్యాగ.

"కాయగూరలన్నీ ఈ రోజువ్యేనమ్మా, తీసుకోండి. బీరకాయలు నవనవలాడుతున్నాయి. బెండకాయలు బాగున్నాయి" చెపుతూ పై ముచ్చిక విరిచింది.

"మునక్కాడలు లేతగున్నాయమ్మా" అంటూ మెలితిప్పి చూపించింది.

"అన్నికూరలూ తలో అరకిలో చొప్పున ఇవ్వు."

"ఇద్దరికి అరకిలో ఎందుకు త్యాగా, పావు చాల్లే" ఆఫీసుకు రెడీ అవుతూ చెప్పాను.

"పక్కింటి కాంతమ్మగారు ఒక్కావిడే ఉంటారు. కొంచెం కూర ఇద్దామని. అన్నట్లు పాపమ్మా... మర్చేపోయాను, నిన్న ఫ్రిజ్‌లో ఆకుకూరలు పెట్టుకున్నావు. వాటిని అమ్ముకోవా?" అంటూ, ఆమె ఇచ్చిన కూరలు తీసుకుని, ఫ్రిజ్‌లో ఆకుకూరలూ డబ్బులూ ఇచ్చి పంపించింది.

"ఫ్రిజ్ కొన్నది నేనూ, దానికయ్యే కరెంట్ బిల్ కట్టేదీ నేనే. అందులో ఉండేవి మాత్రం ఊళ్ళోవాళ్ళ ఆకుకూరలు. అవీ అమ్ముకోవడం కోసమే" విసుక్కున్నాను.

"ఆ మాత్రం సహాయం చెయ్యొచ్చులెండి. లక్షల్లో నష్టపోరుగా. ఈ వయసులో కుటుంబం కోసం ఎంత కష్టపడుతోందో చూడండి. ఒకపక్క ముగ్గురు ఆడపిల్లలూ మరోపక్క తాగుబోతు మొగుడూ" వెళుతున్న పాపమ్మ వైపు జాలిగా చూస్తూ నిట్టూర్చింది.

"త్యాగా, అలమరలో డబ్బులు పెట్టాను. మార్గదర్శి ఏజెంట్ మహేష్ వస్తాడు. చిట్ డబ్బులు ఇచ్చేయ్. చిట్ డబ్బులు మనకి ఇచ్చేటప్పుడు ఎంత కచ్చితంగా చెప్పిన టైమ్‌కి ఇస్తారో నెలనెలా డబ్బులు కట్టించుకునేటప్పుడు కూడా అంతే కచ్చితంగా ఉంటారు" అని చెప్పి ఆఫీసుకి బయలుదేరాను.

★ ★ ★

నాలుగు రోజులు గడిచాయి. ఆఫీసులో బిజీగా పని చేసుకుంటున్నాను. మొబైల్ మోగింది. మహేష్ నుంచి ఫోన్.

"సార్, చిట్ డబ్బులకి ఇంటికి



వెళ్ళమన్నారు. మూడుసార్లు వెళ్ళాను. ఎప్పుడూ ఇంటికి తాళమే."

"మా మిసెస్ ఫోనుకి కాల్ చెయ్యండి. నంబర్ ఇచ్చానుగా?"

"ఆ నంబరుకి కాల్ చేశాను సార్. ఇంటికి తాళంలాగే ఫోన్ కూడా లాక్. ఎవరూ లిఫ్ట్ చేయలేదు. మీరు ఆఫీసుకు రమ్మంటే వస్తాను లేదా సాయంత్రం ఇంటికి వస్తాను."

"సరే, ఇంటికిరా" అని చెప్పి ఫోన్ కట్ చేశాను.

అడిగించుకోవడం అవమానంగా అనిపించింది. త్యాగ మీద కోపం వచ్చింది. ఒళ్ళు మండింది. ఆఫీసు నుంచి ఆవేశంగా వచ్చాను.

గుమ్మంలో పాతబట్టలు పోగులా వేసుకుని కూర్చుంది. ముఖానికీ చేతుల మీదా మసి. బొగ్గుగనిలో పనిచేసే కార్మికురాలిలా ఉంది. ఆ వేషం చూస్తే కోపం మరింత పెరిగింది.

"నీకు చాలా వివరంగా చెప్పాను. అయినా లెక్క లేదు. మాటంటే విలువ లేదు. నేనంటే పట్టింపు లేదు."

"అదీ కాదండీ, పక్కపేటలో..."

"ముఖానికి బొగ్గేమిటీ? చూస్తేనే చికాకుగా ఉంది. అసహ్యంగా కనిపిస్తోంది."

నా అరుపులకు పక్క వాటాల్లో కాపురముండే జనం బైటకొచ్చి చూశారు. అవమానభారం ఆమె కళ్ళలో స్పష్టంగా కనిపించింది. ఏదో చెప్పాలని ప్రయత్నం చేసింది. నేను వినలేదు.

"నీవల్ల మాట పడ్డాను. ఊరు ఉద్ధరించడానికి వెళితే నాకు చెప్పొచ్చుగా. మార్గదర్శి మహేష్‌ని ఆఫీసుకే రమ్మనేవాణ్ణి. తాళం వేసుకుని తిరిగే అంత పని ఏముంది? కనీసం ఫోన్ కూడా తీయలేనన్ని రాచకార్యాలు ఏమున్నాయి?"

"నా మాట వినండీ... అసలు ఏం జరిగిందంటే..."

"నాకేమీ చెప్పకు" కరాఖండిగా చెప్పాను.

"చెప్పకపోతే విషయం ఎలా తెలుస్తుంది?" త్యాగ కాస్త గొంతు పెంచింది.

నా నోరు మూతపడింది. చెప్పడం మొదలుపెట్టింది...

"ఏం జరిగిందంటే, మీరు ఆఫీసుకి వెళ్ళిన కొంచెంసేపటికి పక్కపేటలో పాకలు అంటుకున్నాయి. పెద్దగా అరుపులు. కేకలు, పెడబొబ్బలు. ఫైర్ ఇంజిన్ మోత. ఇళ్ళు తగలబడిపోతున్నాయని తెలిసింది. వెంటనే వెళ్ళాను. మన బట్టలు ఇస్త్రీ చేసే ముత్యాలమ్మ ఇల్లు పూర్తిగా తగలబడిపోయింది. ఇస్త్రీకి ఇచ్చిన బట్టలు కాలి బూడిదైపోయాయి. మంటల్లో కాలిన ఇస్త్రీపెట్టె ఆనవాలు పట్టేలా లేదు. పనికి రాకుండా పోయింది. ఒక్క నిమిషంలో సర్వనాశనమయింది.

కుటుంబమంతా కట్టుబట్టలతో రోడ్డుమీద పడ్డారు. నన్ను చూసి 'అమ్మగారూ' అని పట్టుకుని భోరుమని ఏడ్చింది. ఇదిగో పాతబట్టల మూటలు వాళ్ళకోసమే తీస్తున్నాను. వెళ్ళే కంగారులో ఫోన్ ఇంట్లోనే వదిలేశాను. అప్పుడు ఫోన్ చేశాడు మహేష్. ఇంటికి వచ్చాక తిరిగి చేస్తే తీయలేదు. అదీ జరిగింది" అంటూ మాట్లాడుతూనే ఆడ, మగవాళ్ళ బట్టలు విడదీస్తోంది.

"సర్లే, ఆ దిక్కుమాలిన గొడవ ఆపి, చిట్ డబ్బులు పట్టుకురా. మహేష్ వస్తున్నాడు" అసహనంగా చెప్పాను.

"అవి... అవీ..."

"నీళ్ళు నములుతావేమిటీ. ఆ డబ్బులు ఎవరికి దానం చేశావు?"

"పనమ్మాయి కుమారి కొడుకు సైకిలు మీంచి పడిపోయాడండీ" తడబడుతూ చెప్పింది.

"పడితే?" రెట్టించాను.

"కాలు ఫ్రాక్చర్ అయింది. అర్జెంటుగా హాస్పిటల్‌లో అడ్మిట్ చేసేందుకు డబ్బులు కావాలని వచ్చింది. అవసరంలో..."

"వాళ్ళ అవసరానికి మన పరువు రోడ్డున వేసుకుంటామా?" గట్టిగా అరిచేశాను. బెదురుతూ గదిలో మూలగా వెళ్ళిపోయింది. కాలింగ్ బెల్ మోగింది. బైటకు వెళ్ళి చూస్తే మహేష్ వచ్చాడు. నేను పెట్టిన కేకలు వినబడినట్టున్నాయి. ముఖం ఇబ్బందిగా పెట్టాడు. ఎక్కువసేపు ఉంచడం ఇష్టం లేక పర్సు తీసి చిట్ డబ్బులు ఇచ్చి పంపేశాను. లోపలకెళ్ళి మంచినీళ్ళు తాగి ఎప్పుడూ ఆమెకు చెప్పకుండా బైటకు వెళ్ళని నేను, మాట మాత్రం చెప్పకుండా వెళ్ళిపోయాను.

రెండురోజులు త్యాగ మాట్లాడాలని ప్రయత్నించింది. నేను మాట్లాడలేదు. మూడోరోజు- నేను ఆఫీసుకి బయలుదేరుతుండగా నాతోపాటే భుజాన బ్యాగ్ తగిలించుకుని త్యాగ కూడా బయలుదేరింది.

నిన్నరాత్రి నుంచీ నాతో ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నట్లనిపించింది. నేను పలకలేదు. ఫోన్ లో 'బీప్' శబ్దం వచ్చింది. మెసేజ్... త్యాగ నుంచి... ఈ రోజు ఉద్యోగంలో చేరుతోందనీ పక్కవీధి కాన్వెంట్‌లో టీచర్ పోస్టనీ మెసేజ్ సారాంశం.

అంటే డబ్బు గురించి నా మాటలకు బాధపడిందా? అనవసరంగా మాటలతో ఇబ్బందిపెట్టానా? తప్పు చేశానా? ఆర్థిక స్వాతంత్ర్యం గురించి ఆలోచించిందా? మంచిదేగా. పనిలో పడితే ప్రజాసేవ తగ్గుతుంది అనిపించింది. కాన్వెంట్ పిల్లల్ని చూసైనా పిల్లల్ని కనాలనే ఆలోచన కలిగితే అదే చాలు. కమ్ముతున్న ఆలోచనలతో ఆమెను బండి ఎక్కించుకుని కాన్వెంట్ దగ్గర దింపాను. ఆమె ఆనందానికి అవధులు లేవు.

★ ★ ★

నేను ఆడిట్ పని మీద వారం రోజులు క్యాంపుకి బయలుదేరాను. మొదట రెండు రోజులు ఫోన్ చేశాను. మాట్లాడింది. మూడోరోజు ఉదయమే ఫోన్ చేశాను... కాల్ తీసింది. మధ్యాహ్నం చేశాను... రిప్లై లేదు. పదేపదే చేశాను... సమాధానం రాలేదు. కాన్వెంట్లో ఉందనుకున్నాను. మళ్ళీ చేస్తే అదే పరిస్థితి. నో రిప్లై. 'ఏదో కార్యక్రమానికి వెళ్ళిందిలే' అని సర్దుకున్నాను. ఆ తర్వాత ఎన్నిసార్లు చేసినా ఫోన్ కనెక్ట్ కాలేదు. కంగారు మొదలైంది. ఇక ఉండబట్టలేక కాలనీలో కొలీగ్‌కి ఫోన్ చేశాను.

"నీకు తెలీదా?"

"ఏమైంది?" కంగారుగా అడిగాను.

"మీ వైఫ్ ఆ కాలిన గుడిసెల వైపు వెళ్తుంటే ఆటో డాష్ ఇచ్చింది. మమత హాస్పిటల్‌లో జాయిన్ చేశారు."

వెంటనే ఫోన్‌లో చూస్తే బోలెడు మిస్‌డ్ కాల్స్. నాకు తెలియని నంబర్లని- వాటిని లిఫ్ట్ చేయలేదు. నన్ను నేనే నిందించుకున్నాను. గుడ్డిలో మెల్ల నాకు తెలుసున్న ఆసుపత్రిలోనే అడ్మిట్ చేశారు. ఆసుపత్రి హెడ్ డాక్టర్ వెంకట్ నా ఫ్రెండ్. వెంటనే వాడికి చాలా ఆందోళనగా ఫోన్ చేశాను.

"ఒరేయ్ రావూ, నీ వైఫ్ చాలా ఫేమస్" నేను ఎంతో కంగారుతో ఫోన్ చేస్తే ఈ జోక్ లేమిటి... నాకు కొంచెం చికాకుగా అనిపించింది.

"ముందు త్యాగకి ఎలా ఉందో చెప్పు" పెరుగుతున్న ఆందోళనని అదుపు



చేసుకుంటూ అడిగాను.

"ఆమె ఐసీయూలో సేఫ్. ఔట్ అఫ్ డేంజర్. ఇక్కడ సీన్ చూడాలిరా. 300ఎంఎల్ బ్లడ్ అడిగితే ముప్పై మంది చేతులు చాపుతున్నారు. ఆమెకు చాలా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. మందులు తెమ్మంటే నేను తెస్తానంటే, నేను తెస్తానని మొదటి రోజు మెగా హీరో సినిమా టికెట్స్ కోసం ఎగబడినట్లు పోటీ పడుతున్నారు. పైగా అందరూ ఆడవాళ్ళే, ఆర్థికంగా అంత స్తోమత ఉన్నవాళ్ళలా కూడా కనిపించటం లేదు.

కూరలు అమ్మే పాపమ్మ, లాండ్రీ శ్రీను వైఫ్ నాకు తెలుసున్న వాళ్ళు. మిగతా అంతా మీ కాలనీలోనూ పక్క పేటలోనూ ఉండే ఆడవాళ్ళు అనుకుంటా. త్యాగని కంటికిరెప్పలా చూసుకుంటున్నారు. త్యాగ చాలా లక్కీరా. ఇన్నాళ్ళుగా ప్రాక్టీసు చేస్తున్న నాకే అంతమంది అభిమానులు లేరు. ప్రస్తుతం నా హాస్పిటల్ కొత్త సినిమా వచ్చిన టాకీసులా కిటకిటలాడి పోతోందంటే నమ్ము".

"థ్యాంక్స్ రా వెంకట్. సరైన సమయంలో మరచిపోలేని సహాయం చేశావు. ఇకనైనా త్యాగకి బుద్ధి వచ్చి ఈ ప్రజాసేవ పిచ్చి వదలాలి."

"త్యాగ ఈ రోజు ప్రాణాలతో మన మధ్య ఉందంటే దానికి కారణం నేను చేసిన వైద్యమయితే ఇసుమంతేరా. బుద్ధి రావలసిందీ మారవలసిందీ త్యాగ కాదురా... నువ్వు. అసలు ఆమె చేసిన తప్పేంటి? ఏ రోజైనా నిన్ను నిర్లక్ష్యం చేసిందా? నీకు కావలసినవి చేస్తూనే, జనానికి చేయగలిగిన సాయం చేసింది. అదే సాయం తిరిగి చేసి జనం రుణం తీర్చుకున్నారు. ధర్మాన్ని కాపాడిన వాళ్ళని ధర్మమే రక్షిస్తుందంటే ఇదే. ఇప్పటికైనా ఆలోచించు."

వెంకట్ ఫోన్ కట్ చేసి హెడ్ ఆఫీస్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాను. నా ప్లేసులో మరో మనిషిని ఆడిట్‌కి పంపమని రిక్వెస్ట్ చేశాను. లీవ్ తీసుకుని బస్సు ఎక్కాను. ఆసుపత్రికి చేరగానే సానుభూతితో చుట్టుముట్టిన వాళ్ళని దాటుకుని డాక్టర్ దగ్గరకు వెళ్ళాను. వెంకట్ స్వయంగా నన్ను ఐసీయూలోకి తీసుకెళ్ళాడు. చైతన్యానికి ప్రతీకలా ఉండే నా త్యాగ నిస్తేజంగా పడుకుని ఉండటం చూడలేకపోయాను. చెమర్చిన కళ్ళను గమనించిన వెంకట్ సున్నితంగా భుజం నొక్కాడు.

త్యాగ పరిస్థితి గురించి మాట్లాడుకుంటూ నేనూ వెంకట్ బాల్కనీలోకి వచ్చాం. కింద కోలాహలానికి తొంగిచూస్తే... ఆశ్చర్యం, ఆసుపత్రి ఆవరణంతా జనంతో నిండిపోయి ఉంది. చెట్లకిందా మెట్ల దగ్గరా పార్కింగ్ స్థలంలోనూ జనం గుంపులుగా నిలబడ్డారు. ఆడా మగా అంతా కలసి వందకు పైనే ఉంటారు. త్యాగని తీసుకొచ్చినప్పటి నుంచీ ఇక్కడే ఉన్నారట. వెంకట్ చెప్పాడు. నా ఒళ్ళు జలదరించింది. ఇది ప్రేమా, అభిమానమా, గౌరవమా... నాకు అర్థం కాలేదు. ఎప్పుడో చదివిన మాటలు గుర్తుకొచ్చాయి.

'త్యాగ ఏకో గుణః శ్లాఘ్యః
కిమన్యైహః గుణరాశిభిః
త్యాగాజ్జగతి పూజ్యంతే
పశు పాషాణ పాదపాః'

'ఇతర గుణాలన్నీ రాశి పోసినా త్యాగ గుణానికి సాటిరావు. ఈ లోకంలో పశువులూ శిలలూ చెట్లూ త్యాగ గుణం వల్లనే పూజించబడుతున్నాయి.' అలాంటిది, ఈ జగతి ఇంతగా పూజించే త్యాగకి నేను సహకరించకపోతే ఎలా?

జేబులోంచి మొబైల్ తీసి "వందమందికి భోజనాలు తేగలవా?" కేటరింగ్ శంకరాన్ని అడిగాను.

"రెండు గంటల్లో తెస్తాను సార్, ఓకేనా" అవతలనుంచి చెప్పాడు.

"ఓకే. తీసుకుని మమత ఆసుపత్రి దగ్గరకు రా" నాలో మార్పుని వెంకట్ గమనించినట్లున్నాడు... నర్మగర్భంగా నవ్వడం కనిపించింది. ★



ముద్దొచ్చే బార్బీబొమ్మ... ముచ్చట్లు కూడా మొదలు పెడితే ఎలా ఉంటుంది? పిల్లలకు ఎంతో ఇష్టమైన టెడ్డీబేర్... వాళ్లతో ఆడుకుంటూ, అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతుంటే, చిన్నారులు ఇక ఆ టెడ్డీని వదిలిపెట్టగలరా? ఏఐ పరిజ్ఞానంతో వస్తున్న నయారకం సాఫ్ట్‌టాయ్స్ సంగతులే ఇవన్నీ....



ఏఐ బొమ్మలు... నిజంగా మాట్లాడతాయ్!

ఒక ప్రశ్నకు సమాధానం చెబితే మరో ప్రశ్న సిద్ధంగా ఉంటుంది పిల్లల దగ్గర, వాళ్లతో అలసిపోకుండా ఆడాలంటే ఎనర్జీని అరువు తెచ్చుకోవాల్సిందే! ఇక, ఉద్యోగాలు చేసే అమ్మానాన్నలున్న ఇంట్లో పిల్లల పరిస్థితి మరీ కష్టం. ఆఫీసు నుంచి వచ్చి ఇంట్లో ఉన్న ఆ కాసేపూ పిల్లలతో ఆడుకోవాలని ఉన్నా- అంత శక్తీ, సహనం కూడా ఉండాలి. ముద్దొచ్చే వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఉన్నా అంత తీరిక ఉండాలి. ఇవన్నీ చేయలేకనే... ఒక ఫోన్ చేతిలో ఉంచి, పిల్లలని ఆడుకొమ్మని చెబుతుంటారు లేదా టీవీ ఆన్ చేసి ఒక కార్టూన్ షో పెట్టి, వేరే పనిచేసుకుంటారు. ఇలా చేస్తే పిల్లలు ఎక్కువగా విసిగించరు కాబట్టి, కొన్ని రోజుల వరకూ ఇదంతా బాగానే ఉన్నా- టీవీలూ, ఫోన్లూ చిన్నారులకు ఒక వ్యసనంగా మారిపోయినప్పుడే కొత్త చిక్కులు వచ్చి పడుతుంటాయి. మాటలు సరిగా రాకపోవడం, అభద్రతతో బాధపడటం వంటివి ఆ క్రమంలో ఎదురయ్యే సమస్యలే. వీటికి పరిష్కారం చూపిస్తూ వచ్చినవే 'ఏఐ ప్లష్ టాయ్స్'. ఏఐ టెక్నాలజీతో పనిచేసే వీటిని ఒకరకంగా ప్రాణమున్న బొమ్మలే అనొచ్చు. ఎందుకంటే ఇవి చిన్నారులతో అలసిపోకుండా ఆడతాయి, అడిగిన ప్రతి ప్రశ్నకూ పెద్దవాళ్లలా, విసుక్కోకుండా జవాబులు ఇస్తాయి, బోలెడన్ని కథలు చెబుతూ బుజ్జగిస్తాయి, ఏడిస్తే జోలపాడి ఊరడిస్తాయి. టైమ్‌లేకో, అవకాశం లేకో అమ్మానాన్నలూ, అమ్మమ్మలూ, నాయనమ్మలూ చేయలేని పనులు చేసిపెడుతున్నాయి.



మాటలు నేర్పిస్తాయి...

పిల్లలు ఎక్కడకు వెళ్లినా వాళ్లకిష్టమైన టెడ్డీబేర్‌నో, మరొక బొమ్మనో కూడా వెంట తీసుకెళ్తుంటారు. దాన్నో గొప్ప ఫ్రెండ్‌లా ఫీలవుతుంటారు. తక్కిన బొమ్మలతో పోలిస్తే మెత్తగా ఉండే సాఫ్ట్‌టాయ్స్‌తో వాళ్లకు ఒకరకమైన అనుబంధంతోపాటు, అమ్మానాన్నల దగ్గర దొరికే భద్రతాభావం కూడా దొరుకుతుందట. అందుకే ఎప్పుడూ వాటిని వెంట పెట్టుకుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే చాట్‌జీపీటీ టెడ్డీబేర్ రూపంలో ఉండే తన తొలి ఏఐ బొమ్మని తీసుకొచ్చింది. దీని పేరు 'పో'. 'పో... ఒక కథ చెప్పవు' అంటే, బోలెడు కథలు చెబుతుంది. కథ బోర్‌కొడితే... క్విజ్ ఆడిస్తుంది. అదీ బోర్ అనిపిస్తే... ఓ పొడుపు కథ చెప్పి సమాధానం అడుగుతుంది. మొత్తంమీద పిల్లలని ఫోన్, టీవీల నుంచి దూరం చేసి వాళ్లు ఆలోచించేలా చేస్తుంది. ఇక, క్యూరియో సంస్థ తయారుచేసిన గ్రెమ్, గ్రాక్, గబూలాంటి బొమ్మలైతే పిల్లలకు ఇంగ్లిష్‌తో పాటు కొత్తభాషలనీ నేర్పిస్తాయి. వాళ్ల వయసుని దృష్టిలో పెట్టుకుని చిన్నచిన్న రైమ్స్, పాటలు వంటివీ నేర్పిస్తాయి. వాటిలో తప్పులు దొర్లితే అలా కాదు ఇలా అంటూ సరిదిద్దుతాయి. ఆటిజం, స్లో లెర్నింగ్ వంటి సమస్యలున్న పిల్లలకు కూడా ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని నిపుణులు అంటున్నారు. స్మార్ట్ టెడ్డీ, తూయా ప్లష్ టాయ్, కపబూ ఏఐ బన్నీ, ఫోలో టాయ్ కన్వర్జేషనల్ టాయ్స్ వంటి సంస్థలన్నీ... పిల్లలు ఇష్టపడే సాఫ్ట్‌టాయ్ ఆకృతుల్లో ఈ ఏఐ బొమ్మలని తీసుకొస్తున్నాయి. ఇక, ఆడ పిల్లలకు ఎంతో ఇష్టమైన బార్బీ బొమ్మలనీ మాట్లాడేలా చేస్తోంది చాట్‌జీపీటీ. ఆరునెలల నుంచి పన్నెండేళ్ల పిల్లల వరకూ ఉపయోగించుకునేలా వీటిని తయారుచేస్తున్నారు. వీటికి బ్యాటరీల అవసరం లేదు. ఛార్జింగ్ పెట్టుకుంటే... వైఫై సాయంతో పనిచేస్తాయి.





తల్లిదండ్రులకు సమాచారం...

అరె... చిన్నపిల్లలు తెలియక ఏవో పిచ్చి ప్రశ్నలు అడిగితే ఈ బొమ్మలు ఏదో ఒక సమాధానం చెబితే పిల్లలకు ప్రమాదం కదా అంటారా? ఆ ప్రమాదం లేకుండా ఈ బొమ్మల తాలూకు పేరంటల్ కంట్రోల్ మొత్తం తల్లిదండ్రుల చేతిలోనే ఉంటుంది. బొమ్మలకు అనుసంధానించిన యాప్‌లో పిల్లలు ఏ ప్రశ్నలు అడుగుతున్నారు, దానికి వచ్చిన సమాధానం ఏంటి... వంటివన్నీ సంభాషణల రూపంలో తల్లిదండ్రులకు చేరిపోతాయి. అంతేకాదు ఈ బొమ్మలన్నీ పిల్లల వయసునూ, మానసిక పరిస్థితినీ దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా తయారుచేస్తారు. రెస్పాన్సిబుల్ ఏఐ టెక్నాలజీ సాయంతో పిల్లలకు అక్కర్లేని సమాచారం అందకుండా సంస్థలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ★



బడిని తీర్చిదిద్దుకున్నారు!

చూడ్డానికి ప్రైవేటు స్కూళ్లలా కనిపించినా... ఇవన్నీ ప్రభుత్వ పాఠశాలలే. వీటిని ఆ స్థాయిలోకి మార్చే క్రమంలో అక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులే కాదు... ఊరంతా ఒక్కటయ్యింది. మరి ఆ విశేషాలేంటో చూసేద్దామా...



ప్రాథమిక సదుపాయాలు కల్పించి...

అది కరీంనగర్ జిల్లా, ధర్మపురి మండలంలోని దోనూరు ప్రాథమిక పాఠశాల. ఒకప్పుడు ఆ స్కూల్లో విద్యార్థుల సంఖ్య ముప్పైరెండు. ఒకే ఒక్క టీచర్ ఉండేవాడు. దానికితోడు పాఠశాల కూడా శిథిలావస్థకు చేరుకుంది. దాంతో ఆ ఊళ్లోని తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలలకు పంపించడం మొదలుపెట్టారు. కొన్నాళ్లకు ఆ ప్రభుత్వ పాఠశాలను మూసేయడం ఖాయమని అంతా అనుకుంటున్న సమయంలో కసెట్టి రమేశ్ ప్రధానోపాధ్యాయుడిగా అక్కడికి బదిలీపైన వచ్చాడు. ఆయన నెమ్మదిగా స్కూలు అభివృద్ధిపైన దృష్టిపెట్టాడు. నీళ్లు, విద్యుత్తు, మరుగుదొడ్లు, పిల్లలు కూర్చునేందుకు బెంచీలు.. ఇలా ప్రాథమిక సదుపాయాలేవీ ఆ బడిలో లేకపోవడం గమనించాడు. అవన్నీ సమకూర్చితే పిల్లల సంఖ్య పెరుగుతుందని భావించాడు. ఆ ఆలోచనకు గ్రామస్థులే కాక, పిల్లల తల్లిదండ్రులూ, పూర్వ విద్యార్థులూ, స్థానిక నేతలు కూడా ఊతమిచ్చారు. కట్‌చేస్తే స్కూలు భవనం అత్యాధునికంగా మారిపోయింది. బెంచీలూ, స్మార్ట్ టీవీ, విద్యుత్తు, మంచినీటి పంపులు, టాయిలెట్లు.. ఒకటేమిటి అన్నీ ఏర్పాటయ్యాయి. గ్రామస్థులు బడి గోడల్నీ అందంగా తీర్చిదిద్దారు. అదనంగా ఒక టీచర్‌తోపాటు ఇద్దరు వలంటీర్లు పిల్లలకు బోధించేందుకు ముందుకొచ్చారు. కొద్దిరోజుల్లోనే పిల్లల సంఖ్య 32 నుంచి వందకు పెరిగింది. ఈ ప్రయత్నం ఇక్కడితోనే ఆగిపోలేదు. నెలకోసారి ఇక్కడ నిర్వహించే సమావేశాల్లోనూ గ్రామస్థులు పాల్గొని తోచిన సాయం చేస్తున్నారట.

– తుమ్మల శ్రీనివాస్, ఈనాడు, కరీంనగర్


రమేశ్



స్కూలు కోసం ఒక్కటయ్యారు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులే తక్కువ. అలాంటిది కర్ణాటక, చిత్రదుర్గ హిరియూర్ తాలూకాలోని ధలావట్టిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఆ ఊరినుంచే కాకుండా... చుట్టుపక్కల గ్రామాల పిల్లలూ చదువుకునేందుకు రావడం విశేషం. ఎందుకంటే... ఇప్పుడా స్కూలు అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి వచ్చింది మరి. నిజానికి ఈ గవర్నమెంట్ స్కూల్‌ను 1925లో నిర్మించారు. రోజులు గడిచేకొద్దీ విద్యార్థుల సంఖ్య తగ్గడంతోపాటు భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఏడాది ఆ బడి వందేళ్లు పూర్తి చేసుకోవడంతో... ఒకప్పుడు అందులో చదువుకున్న విద్యార్థులే కాకుండా గ్రామస్థులూ ఆ బడికోసం ఏదో ఒకటి చేయాలనుకున్నారు. అలా అంతా కలిసి ఒకటిన్నర కోట్ల రూపాయల్ని సమకూర్చి కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ఇప్పుడు ఆ బడిలో పదకొండు తరగతి గదులు, ఆధునిక కంప్యూటరు ల్యాబ్, గ్రంథాలయం, కిచెన్, డైనింగ్‌హాలు, నలభైవేల లీటర్ల వాన నీటిని భద్రపరిచే ట్యాంకు.. ఇలా అన్నిరకాల సదుపాయాలూ ఉన్నాయి. అంతేనా.. పిల్లల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేకంగా గెస్ట్‌టీచర్‌నూ ఏర్పాటు చేశారు. ఒకప్పుడు కన్నడ మాధ్యమంలోనే బోధించిన ఈ స్కూల్లో ఇంగ్లిష్ మీడియంను కూడా చేర్చడంతో స్థానికంగా ఉండే ఐమంగళ, వద్దికెరె, బసప్పుణ్ణ మలిగె... తదితర గ్రామాల నుంచీ పిల్లలు ఈ ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు ఆసక్తి చూపించడం గమనార్హం.






స్థానిక ఎమ్మెల్యే చొరవతో...

ఆ పాఠశాల కొన్ని వందలమంది విద్యార్థుల్ని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దింది. అక్కడ చదువుకున్న వాళ్లలో ఇంజినీర్లు, డాక్టర్లు, ప్రభుత్వ అధికారులు ఇలా ఎంతోమంది ఉన్నారు. అయితే అనుకోని అగ్ని ప్రమాదంతో ఆ స్కూలు పరిస్థితి దయనీయంగా మారింది. దానికితోడు విద్యార్థుల సంఖ్యా క్రమంగా తగ్గిపోవడంతో ఆ బడిని అభివృద్ధి చేయాలనుకున్నాడు అక్కడే పదో తరగతి చదువుకుని ఎమ్మెల్యేగా ఎదిగిన కె. ప్రేమ్‌సాగర్. ప్రభుత్వం నుంచి దాదాపు పదకొండు కోట్ల రూపాయల్ని మంజూరు చేయించి... ఆ స్కూలు రూపురేఖల్ని పూర్తిగా మార్చేశాడు. దాంతో ఆ బడి అధునాతన బిల్డింగ్‌తో ల్యాండ్‌స్కేప్ డిజైన్లతో, కార్పొరేట్ స్కూల్‌స్థాయిలో కనిపించడంతోపాటు ల్యాబ్, లైబ్రరీ, మంచినీటి సదుపాయం... ఇలా అన్నీ ఏర్పాటయ్యాయి. బడికి సంబంధించిన కాలేజీ కూడా పూర్తిగా అత్యాధునికంగా మారిపోయింది. దీని ప్రారంభోత్సవ వేడుకకి ఆ ఊరివాళ్లకే కాకుండా... ఒకప్పుడు అక్కడ చదువుకున్న విద్యార్థులకూ ఆహ్వానం అందడంతో ఆహ్వానితులంతా సంభ్రమాశ్చర్యచకితులయ్యారు. అదే మంచిర్యాల జిల్లా, లక్సెట్టిపేట మండలంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల- జూనియర్ కళాశాల.




ప్రేమ్‌సాగర్



‘పంచదార పాకానికి రంగేస్తే... అదే చాక్లెట్. అలాంటి దానికోసం.... ఇంత పరిశోధన అవసరమా’ అన్నవాళ్లే ఎక్కువ. రాజీవ్‌కుమార్ అవేమీ పట్టించుకోలేదు. తాను కోరుకున్న రుచిలో ఆ క్యాండీ వచ్చేంతవరకూ ఓపిక పట్టాడు. ఫలితం... ఏడాదికి 750 కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ మార్కెట్లో దూసుకుపోతోంది క్యాండీ. ఇంతకీ దాని పేరు ఏంటో తెలుసా... పల్స్. తియ్యగా, ఉప్పగా అచ్చంగా పచ్చిమామిడి రుచితో ఉండే పల్స్ విజయం వెనక వందేళ్ల కష్టం దాగి ఉంది...

పల్స్ క్యాండీతో... రూ.750 కోట్ల వ్యాపారం!



ఒకరకం వెదురు మొక్క భూమిని చీల్చుకుని మొలకెత్తడానికి ఒకటీ రెండూ రోజులు కాదు... ఏకంగా ఐదేళ్ల సమయం పడుతుందట. ఒక్కసారి మొలకెత్తిందా కొన్ని రోజుల్లోనే ఆకాశాన్ని తాకుతుందేమో అన్నంత ఎత్తుగా చకచకా ఎదుగుతుంది. మరి మొలకెత్తడానికి అంత సమయం ఎందుకూ అంటే... ఆ ఐదేళ్లూ అది ఖాళీగా ఏమీ ఉండదు, దాని వేర్లని భూమిలోపలికి బలంగా తీసుకెళ్తుంది. ఆ బలంతోనే అది వందేళ్లు బతుకుతుంది. ఈ కథ అచ్చంగా ‘పల్స్’ క్యాండీకి సరిపోతుంది. అవును, ఒక క్యాండీ ఏడాదికి 750 కోట్ల రూపాయల వ్యాపారం చేయడం అంటే మామూలు విషయమేమీ కాదు. లాభాలు తక్కువగా ఉండే ఈ రంగంలో ఎన్నో రకాల క్యాండీలు వచ్చినంత వేగంగానే కనుమరుగైపోతుంటాయి. ఆశ, మ్యాంగోబైట్, ఆల్పెన్‌లీబే, కిస్‌మీ అంటూ ఎన్నో బ్రాండులు చూసుంటాం. వాటన్నింటినీ మరిపించి భారతీయుల మనసు దోచుకోవాలనుకున్నాడు ‘పల్స్’ను తయారుచేసిన రాజీవ్‌కుమార్. మనదేశంలో ఒక్కో ప్రాంతంవాళ్లు, ఒక్కో రుచిని ఇష్టపడినా... ఉప్పు, కారం అద్దిన పచ్చిమామిడి రుచికి మాత్రం దేశమంతా ఫ్యాన్స్ ఉన్నారు. ఆ రుచినే ఓ చాక్లెట్‌లోకి చొప్పిస్తే ఎలా ఉంటుందని ఆలోచించాడు రాజీవ్. క్యాండీ మధ్యలో మామిడితో చేసిన మసాలా వచ్చేటట్టు చేయడానికి అతని బృందానికి రెండేళ్లు పట్టింది. ఆ పనికి ఇది చాలా ఎక్కువ సమయమే! కానీ 2015లో మార్కెట్లోకి వచ్చిన ఈ క్యాండీ ఆరునెలల్లోనే వంద కోట్ల వ్యాపారం చేసి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఆపైన పదేళ్లలో నం.1 స్థానానికి చేరుకుంది. ‘పల్స్’ మార్కెట్లోకి వచ్చి పదేళ్లే అవుతోంది కానీ, దాన్ని తయారుచేసిన డీఎస్ గ్రూప్‌కి మాత్రం వ్యాపారంలో వందేళ్ల అనుభవం ఉంది. ఉప్పు నుంచి పప్పు వరకూ... స్టీల్ నుంచి సిమెంట్ వరకూ సమస్తం అమ్మే కంపెనీల జాబితా తీస్తే టాటా, గోద్రెజ్, రిలయన్స్‌లాంటి సంస్థలే గుర్తుకొస్తాయి కదా... ఆ జాబితాలో డీఎస్ గ్రూప్ కూడా ఉంది. డీఎస్ అంటే ధరంపాల్- సత్యపాల్ అని అర్థం. ఈ సంస్థ ‘క్యాచ్’ పేరుతో ఉప్పు నుంచి మొదలుపెట్టి ఇంగువ, మసాలాలూ, నెయ్యి, మినరల్ వాటర్, మౌత్ రిఫ్రెషనర్లు... ఇలా సమస్తం అమ్ముతూ ఏటా పదివేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోంది. వాటిల్లో ఈ ‘పల్స్’ క్యాండీ ఓ గేమ్ ఛేంజర్. అంత పెద్ద సంస్థ అయితే ఓ చిన్న క్యాండీకోసం ఇంత కష్టపడాలా... అనే సందేహం రావొచ్చు. వ్యాపారంలో ఏం చేసినా మనసు పెట్టి చేయాలన్న తన తాతగారి సలహానే ఇందుకు కారణం అంటాడు రాజీవ్‌కుమార్. ఆ వ్యాపార సూత్రమే సున్నా నుంచి మొదలైన డీఎస్ సంస్థని ఇంతవరకూ తీసుకొచ్చింది మరి.

చాందినీ చౌక్‌లో మొదలై...

95 ఏళ్ల క్రితం... చాందినీ చౌక్‌లో అత్తరు దుకాణం ప్రారంభించి కుటుంబాన్ని పోషించేవాడు రాజీవ్‌కుమార్ తాతయ్య ధరంపాల్. అతని వ్యాపారమెలకువలనే రాజీవ్ ఒంటపట్టించుకున్నాడు. ‘ట్రేడ్ మార్కులూ, బ్రాండింగ్‌లూ అంటే ఏంటో తెలియని రోజుల్లో తాత ధరంపాల్, నాన్న సత్యపాల్ ప్రజలు కోరిన విధంగా అత్తర్లు చేసి, వినూత్న ప్రచారంతో వ్యాపారాన్ని పెద్ద ఎత్తున విస్తరించారు. కానీ ఓ అగ్ని ప్రమాదంలో మా దుకాణం మొత్తం బూడిదకుప్పగా మారింది. అప్పుడు మా నాయనమ్మ తన నగలు ఇచ్చి, మళ్లీ వ్యాపారం చేయమంది. ఈసారి తాతయ్య అత్తర్లతోపాటు, నోటిని పరిమళభరితం చేసే మౌత్‌ఫ్రెషనర్ల వ్యాపారం కూడా మొదలుపెట్టారు. ఆ క్రమంలోనే మా సంస్థ తయారుచేసిన ‘రజనీగంధా’కి ఎంతో పేరు వచ్చింది. కుర్రకారు ఇష్టంగా తినే ‘పాస్‌పాస్’ కూడా మా ఉత్పత్తే. అలా మా గ్రూప్- ఉప్పు, మసాలాలు, మినరల్ వాటర్, స్టీల్, సిమెంట్ తయారీ అంటూ ఎన్నో రంగాల్లోకి వచ్చింది. వ్యాపారంలో ఎంత ఎత్తు ఎదిగినా ఒక పనిని మొదలుపెడితే ఇప్పుడే మొదలుపెట్టినంత ఉత్సుకతతో చేస్తే, అదే నిన్ను మార్కెట్లో నం.1గా నిలుపుతుందనేవారు తాతయ్య. ఇప్పటికీ నేనా సూత్రాన్ని పాటిస్తున్నా’నని రాజీవ్‌కుమార్ అటు సేవలోనూ తనదైన ముద్ర వేస్తున్నాడు. హరియాణాలో ‘సరళ్ సత్య’ పేరుతో వేలమంది పిల్లలకు ఉచిత విద్యని అందిస్తున్నాడు. యూపీ, రాజస్థాన్, బుందేల్‌ఖండ్ ప్రాంతాల్లో చెక్‌డ్యాములు నిర్మిస్తూ నీటిని ఆదా చేస్తూ వేలమంది రైతులకు ఉపాధి కల్పిస్తున్నాడు. ★

సిసింద్రీ

అహంకారం పనికిరాదు!

రామాపురంలోని బడికి మంచి పేరు ఉండేది. అందులో చేరేందుకు చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులూ పోటీపడుతుండేవారు. దాంతో పదో తరగతిలో ఏ, బీ అని రెండు సెక్షన్లు పెట్టారు. అయితే, తాము తెలివైన వాళ్లం కాబట్టి 'ఏ' సెక్షన్‌లో ఉన్నామని అందులోని వారూ... తాము వాళ్లకంటే బడిలో ఆలస్యంగా చేరడం వల్లే 'బీ' సెక్షన్‌లో ఉన్నాం తప్పితే ప్రతిభ ఆధారంగా కాదని ఆ క్లాసులోని వాళ్లూ అనుకునేవారు. ఆ ఏడాది స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించింది. అదే విషయాన్ని ఉపాధ్యాయులు అన్ని తరగతుల్లోనూ చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులను పేర్లు ఇవ్వమని అడిగారు. సైకిల్ పోటీలకు 'ఏ' సెక్షన్ నుంచి రాధేశ్యాం, రోహిత్ పేర్లు ఇచ్చారు. వారిద్దరూ మంచి స్నేహితులు. పైగా క్లాసులో పోటీపడి చదివేవారు. మొదటి రెండు ర్యాంకుల్లో ఎప్పుడూ వారిద్దరే ఉండేవారు. 'రోహిత్... స్కూల్లో ఫస్టూ సెకండూ మనమిద్దరమే కాబట్టి, ఈ సైకిల్ పందెంలో కూడా మనమే ముందుండాలి' అన్నాడు రాధేశ్యాం. 'మనం రోజూ ఊరి నుంచి సైకిల్ మీదే వస్తున్నాం కాబట్టి, కంగారు పడాల్సిన పని లేదు. సులభంగానే గెలిచేస్తాం' అన్నాడు రోహిత్ ధీమాగా.


గప్‌చుప్

పిల్లలంతా బుద్ధిగా పాఠం వింటున్నారు కదూ! బొమ్మను బాగా గమనించి, కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి చూద్దాం.

1. క్లాస్‌లో మొత్తం ఎంతమంది పిల్లలున్నారు?
2. ఇచ్చిన ఆధారం సాయంతో అది ఉదయమో, మధ్యాహ్నమో చెప్పగలరా?
3. పిల్లలకు ఏ క్లాస్ జరుగుతుందో తెలిసిందా?
4. బొమ్మలో ఒక పొరపాటు ఉంది. అదేంటో కనిపెట్టారా?
5. ఇందులో వాటర్ బాటిల్ ఎక్కడుందో మీకు కనిపించిందా?




బొమ్మ గీద్దాం



తప్పులే తప్పులు

పిల్లలంతా ఎంచక్కా కాలక్షేపం చేస్తున్నారు కదూ! ఈ బొమ్మలో అయిదు పొరపాట్లు ఉన్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.



దాగుడుమూతలు

పిల్లలు పార్కులో హాయిగా ఆడుకుంటున్న చిత్రమిది. కింద వరసలో ఉన్న వస్తువులు బొమ్మలో ఎక్కడ దాగున్నాయో చెప్పండి చూద్దాం.




'బీ' సెక్షన్ నుంచి గోపాల్ ఒక్కడే పేరు ఇచ్చాడు. రెండ్రోజుల తర్వాత పోటీలు మొదలయ్యాయి. సైకిల్ పందెంలో పాల్గొన్న వారంతా ఎవరికి వాళ్లు గెలవాలనే కసితో వేగంగా తొక్కుతున్నారు. అనుకున్నట్లుగానే రాధేశ్యాం, రోహిత్‌లు కొద్దితేడాతోనే ముందు వరసలో ఉన్నారు. రాధేశ్యాం గెలిచే అవకాశం కనిపిస్తుండడంతో మిగతా విద్యార్థులంతా 'రాధా... రాధా...' అని అరుస్తూ చప్పట్లు కొడుతున్నారు. దాంతో తనకు పట్టరాని ఆనందం కలిగింది. ఇక మొదటి బహుమతి తనకే అనుకుంటూ పొంగిపోయాడు. ఆ ఆనందంలో సైకిల్ హ్యాండిల్‌ను వదిలేసి, విజయం నాదే అన్నట్లు గర్వంగా రెండు చేతులూ పైకెత్తి దూసుకువెళ్లసాగాడు. కొద్ది క్షణాల్లో గమ్యం చేరుకుంటాడని అనుకుంటుండగా... ఒక్కసారిగా అతడి సైకిల్ అదుపు తప్పింది. హ్యాండిల్‌ను వదిలేసి ఉండడంతో పట్టు కోల్పోయి, కింద పడిపోయాడు. సైకిల్ మరో పక్కకు పడిపోయింది. వెనుకే వేగంగా వస్తున్న రోహిత్- కిందపడి ఉన్న సైకిల్‌ను తప్పుకోలేక తనూ కిందపడ్డాడు. దాంతో, వాళ్లిద్దరికంటే వెనక వస్తున్న 'బీ' సెక్షన్‌లో ఉండే గోపాల్- గమ్యాన్ని చేరుకొని విజేతగా నిలిచాడు. అతి నమ్మకం, అహంకారం మనల్ని ఓటమిపాలు చేయడమే కాదు... కొన్నిసార్లు ప్రమాదంలోనూ పడేస్తాయని రాధేశ్యాం, రోహిత్‌లకు అప్పుడు అర్థమైంది.




– పి.ఎల్.ఎన్.మంగారత్నం

దారి కనుక్కోండి

ఆహారం కోసం బయటకు వెళ్లిన పక్షులు తిరిగి గూటికి బయలుదేరాయి. ఇంతలో వాటికి పెద్ద పాము, పిల్లీ కనిపించాయి. వాటికి దొరక్కుండా- ఆ పక్షులు గూటికి చేరే మార్గం చూపరూ!



తెలుసా... తెలుసా...



ఇక్కడున్న బొమ్మల ఆంగ్ల పేర్లలోని మొదటి అక్షరాలను కలిపితే ఓ కూరగాయ పేరు వస్తుంది. అదేంటో చెప్పుకోండి చూద్దాం.

అది ఏది?



పవన్ చేతికి వేసుకున్న గ్లవ్‌కు జత మిగతా వాటితో కలిసిపోయింది. మరి అది ఏదో చెప్పండి చూద్దాం.

రంగులేద్దాం



జవాబులు

గప్‌చుప్: 1. పదిహేడు 2. మధ్యాహ్నం (డిజిటల్ క్లాక్‌లో సమయం రెండున్నర అయింది) 3. గణితం (టీచర్ చేతిలో పుస్తకం) 4. రెండో వరసలో చివరనున్న పాప కుర్చీకి కాళ్లు లేవు 5. కుండీలోని మొక్క ఆకుల మధ్య.

తప్పులే తప్పులు: 1. కుందేలు కూడా పక్షులతోపాటు ఎగురుతోంది 2. పొట్లకాయలు చెట్టుకు కాశాయి 3. మంచు ప్రాంతంలో మాత్రమే నివసించే పెంగ్విన్ అక్కడ ఉండటం 4. అద్దంలో బాబు టోపీ 5. ఆధారం లేని గొడుగు.

దాగుడుమూతలు: కిందున్న పొదలో నక్షత్రం, గాలిపటం పట్టుకున్న బాబు పక్కనున్న పొదలో కుందేలు, బాబు తల మీద ఉన్న కడ్డీల మధ్యలో చక్రంలా డోనట్, లైట్‌లో స్కేలు, జెండా ఎగువన బొంగరం, చెట్టు కాండం మీద కొడవలి, గాలిపటం తోకలో చాక్లెట్, ఊయల గొలుసులకు డంబెల్.

తెలుసా... తెలుసా..: BRINJAL (Bamboo, Rose, Idly, Nine, Jam, Apple, Lamp). **అది ఏది?:** 9

మాంసకృత్తులతోపాటు మరెన్నో పోషకాలను అందిస్తుంది శాకాహారుల మాంసంగా పిలిచే సోయా. అందుకే మీల్‌మేకర్, సోయాకీమాతో అప్పుడప్పుడూ ఇలాంటి వంటకాలను వండితే సరి.




సోయా... మనసు దోచెనయా!

సోయాకీమా మసాలా

కావలసినవి: **సోయా కీమా:** పెద్ద కప్పు (వేడినీటిలో నానబెట్టుకుని అయిదు నిమిషాలయ్యాక విడిగా తీసుకోవాలి), **బఠాణీ:** అరకప్పు, **కారం:** ఒకటిన్నర టేబుల్‌స్పూను, **పసుపు:** పావుచెంచా, **దనియాలపొడి:** రెండు చెంచాలు, **గరంమసాలా:** చెంచా, **చాట్‌మసాలా:** చెంచా, **నూనె:** మూడు చెంచాలు, **జీలకర్ర:** చెంచా, **దాల్చినచెక్క:** చిన్నముక్క, **మిరియాల పొడి:** పావుచెంచా, **బిర్యానీ ఆకు:** ఒకటి, **లవంగాలు:** మూడు, **ఉల్లిపాయ ముక్కలు:** ముప్పావుకప్పు, **ఉల్లిపాయపేస్టు:** పావుకప్పు, **టొమాటో పేస్టు:** కప్పు, **పచ్చిమిర్చి తరుగు:** చెంచా, **అల్లంవెల్లుల్లి పేస్టు:** టేబుల్‌స్పూను, **ఉప్పు:** తగినంత, **కసూరీమేథీ:** చెంచా, **కొత్తిమీర తరుగు:** రెండు టేబుల్‌స్పూన్లు.

తయారీ విధానం: ఓ గిన్నెలో కారం, పసుపు, దనియాలపొడి, గరంమసాలా, చాట్‌మసాలా వేసుకుని పావుకప్పు నీళ్లు పోసి కలిపి పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె వేసి జీలకర్ర, దాల్చినచెక్క, బిర్యానీఆకు, లవంగాలు వేయించాలి. నిమిషమయ్యాక ఉల్లిపాయముక్కలు, మిరియాలపొడి, పచ్చిమిర్చి తరుగు కూడా వేయించి ఉల్లిపాయపేస్టు, టొమాటోపేస్టు, అల్లంవెల్లుల్లి పేస్టు వేయాలి. ఇవి వేగుతున్నప్పుడు బఠాణీ, కలిపి పెట్టుకున్న మసాలా నీళ్లు, తగినంత ఉప్పు, సోయా కీమా, కసూరీమేథీ, కొత్తిమీర తరుగు వేసి... ఒకటిన్నర కప్పుల వేడినీళ్లు పోసి మూత పెట్టాలి. ఈ కూర ఉడికి చిక్కగా అవుతున్నప్పుడు స్టవ్‌ని కట్టేయాలి.



షాహీ మీల్‌మేకర్

కావలసినవి: **మీల్‌మేకర్:** ఒకటింబావు కప్పు, **నూనె:** పావుకప్పు, **యాలకులు:** నాలుగు, **జీలకర్ర:** చెంచా, **అల్లం ముక్కలు:** టేబుల్‌స్పూను, **ఉల్లిపాయ:** ఒకటి పెద్దది, **జీడిపప్పు:** పావుకప్పు, **ఉప్పు:** తగినంత, **పసుపు:** అర చెంచా, **కారం:** ఒకటిన్నర చెంచా, **గరంమసాలా:** చెంచా, **కసూరీమేథీ:** టేబుల్‌స్పూను, **కొత్తిమీర తరుగు:** రెండు టేబుల్‌స్పూన్లు, **క్రీమ్:** టేబుల్‌స్పూను.

తయారీ విధానం: ముందుగా మీల్‌మేకర్‌ను చెంచా ఉప్పు వేసిన నీటిలో అయిదు నిమిషాలు ఉడికించుకుని ఆ తరవాత గట్టిగా పిండి విడిగా పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె వేసి... యాలకులు, జీలకర్ర, అల్లంముక్కలు, ఉల్లిపాయ తరుగు, జీడిపప్పు వేసి బాగా వేయించుకోవాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మాత్రం విడిగా తీసుకుని మిక్సీలో మెత్తని పేస్టులా చేసుకోవాలి. ఇప్పుడు కడాయిలో మిగిలిన నూనెలోనే పసుపు, కారం వేసుకుని మీల్‌మేకర్ వేసి ఎర్రగా వేయించుకోవాలి. ఇందులో చేసిపెట్టుకున్న మసాలా, తగినంత ఉప్పు వేసి, రెండు కప్పుల నీళ్లు పోయాలి. ఈ మిశ్రమం ఉడుకుతున్నప్పుడు గరంమసాలా, కసూరీమేథీ, కొత్తిమీర తరుగు వేసి కలిపి దింపేముందు క్రీమ్ వేసుకోవాలి.

సోయా పాలక్

కావలసినవి: పాలకూర తరుగు: పెద్ద కప్పు, మీల్‌మేకర్: కప్పు, టొమాటోలు: మూడు, అల్లం: చిన్నముక్క, పచ్చిమిర్చి: మూడు, నూనె: రెండు టేబుల్‌స్పూన్లు, కసూరీమేథీ: టేబుల్‌స్పూను, జీలకర్ర: అరచెంచా, దనియాలపొడి: చెంచా, కారం: అరచెంచా, గరంమసాలా: అరచెంచా, ఉప్పు: తగినంత, క్రీమ్: టేబుల్‌స్పూను.

తయారీ విధానం: ఓ గిన్నెలో రెండు కప్పుల నీళ్లు పోసి స్టవ్‌మీద పెట్టాలి. అవి మరుగుతున్నప్పుడు చెంచా ఉప్పు, మీల్‌మేకర్ వేసి అయిదు నిమిషాలయ్యాక దింపేయాలి. ఈ నీటిని పూర్తిగా వంపేసి మీల్‌మేకర్‌ను గట్టిగా పిండి విడిగా పెట్టుకోవాలి. అదేవిధంగా పాలకూర తరుగును కూడా నీటిలో అయిదారు నిమిషాలు ఉడికించుకుని తర్వాత ఆకుల్ని మిక్సీలో వేసుకుని మెత్తగా చేసుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె వేసి జీలకర్ర వేయించి, పచ్చిమిర్చి, తరుగు, అల్లం తరుగు వేయాలి. ఇప్పుడు టొమాటో పేస్టు వేయాలి. ఇది మగ్గుతున్నప్పుడు కారం, తగినంత ఉప్పు, గరంమసాలా, దనియాలపొడి, పాలకూరపేస్టు వేసి పావుకప్పు నీళ్లు పోయాలి. నూనె పైకి తేలుతున్నప్పుడు కసూరీమేథీ, మీల్‌మేకర్ వేసి బాగా కలిపి... చివరగా క్రీమ్ వేసి దింపేయాలి.



సోయా 65



కావలసినవి: **మీల్‌మేకర్:** పావుకేజీ, **ఉప్పు:** తగినంత, **కారం:** ఒకటిన్నర చెంచా, **గరంమసాలా:** చెంచా, **అల్లంవెల్లుల్లిపేస్టు:** రెండు చెంచాలు, **పసుపు:** పావుచెంచా, **మొక్కజొన్నపిండి:** నాలుగున్నర టేబుల్‌స్పూన్లు, **మైదా:** మూడు టేబుల్‌స్పూన్లు, **మిరియాలపొడి:** చెంచా, **పెరుగు:** రెండున్నర టేబుల్‌స్పూన్లు, **నిమ్మరసం:** రెండు టేబుల్‌స్పూన్లు, **నూనె:** వేయించేందుకు సరిపడా.

తయారీ విధానం: ఓ గిన్నెలో సగం వరకూ నీళ్లు తీసుకుని అరచెంచా ఉప్పు, మీల్‌మేకర్ వేయాలి. నీళ్లు మరిగి, మీల్‌మేకర్ మెత్తగా అవుతున్నప్పుడు దింపేయాలి. ఈ నీటిని పూర్తిగా వంపేసి మీల్‌మేకర్‌ను గట్టిగా పిండి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. వీటిపైన నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలిపి అరగంటసేపు పక్కన పెట్టేయాలి. ఆ తర్వాత నాలుగైదు చొప్పున కాగుతున్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీసుకుంటే టొమాటో కెచప్‌తో కలిపి తినడమే ఆలస్యం.

రాశి ఫలం

(సెప్టెంబరు 7 - 13)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

విజయాలు సిద్ధిస్తాయి. ఆశయాలు నెరవేరతాయి. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. భూ, గృహ వాహన యోగాలు ఉన్నాయి. ఎన్ని ప్రలోభాలు ఊరించినా ధర్మ మార్గాన్ని విడిచిపెట్టకండి. వ్యాపారంలో కొత్త సమస్యలు ఎదురుకాకుండా జాగ్రత్తపడాలి. వారం మధ్యలో ఓ మేలు జరుగుతుంది. ఇష్టదైవాన్ని ప్రార్థించండి.



వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

లాభదాయకమైన వారం. బుద్ధిబలంతో ముఖ్య నిర్ణయాలు తీసుకోవాలి. వ్యాపార విస్తరణకు సరైన సమయం. ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. ఆలోచించి పెట్టుబడులు పెట్టాలి. కొద్దిపాటి ప్రయత్నంతోనే విజయాలు సాధిస్తారు. బంధుమిత్రులు మనోబలాన్ని అందిస్తారు. మీవల్ల కొందరికి మేలు జరుగుతుంది. మహాలక్ష్మిని ధ్యానించండి.




మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

జీవిత ఆశయం నెరవేరుతుంది. సమాజం మీ ప్రతిభను గుర్తిస్తుంది. ధనయోగం పుష్కలంగా ఉంది. వ్యాపారంలో కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. ముఖ్య వ్యవహారాల్లో అశ్రద్ధ పనికిరాదు. తక్షణమే సమర్థంగా స్పందించాలి. వివాదాలకు దూరంగా ఉండాలి. దైవబలం అండగా నిలుస్తుంది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పూజించండి.



కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

వ్యాపార ఫలితాలు అత్యుత్తమం. జన్మశుక్ర యోగం వల్ల ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. భూ, గృహ సంబంధమైన వ్యవహారాల్లో ముందడుగు పడుతుంది. ఉద్యోగులు స్థిరమైన నిర్ణయాలు తీసుకోవాలి. అపార్థాలకు ఆస్కారం ఇవ్వకండి. అవకాశాల్ని సద్వినియోగం చేసుకోండి. కుటుంబ సభ్యుల సూచనలు పాటించండి. శివ సహస్రనామం పఠించండి.



సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఏకాగ్రతతో కొత్త పనులను ప్రారంభించండి. విజయాలు సొంతం అవుతాయి. మనోబలం అవసరం. చిన్నపాటి అవరోధాలకు వెనకడుగు వేయకండి. ఉద్యోగులు మరింత శ్రద్ధగా పనిచేయాల్సిన సమయం. వ్యాపారులు లౌక్యంగా వ్యవహరించాలి. ఉద్యోగాల్ని దారి తప్పించే వారితో జాగ్రత్త. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

మనోబలం ముందుకు నడిపిస్తుంది. ఏకాదశ శుక్రయోగం సంపదల్ని ప్రసాదిస్తుంది. విజయాలు చేరువలో ఉన్నాయి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో ప్రతి నిర్ణయమూ కీలకమే. కుటుంబ సభ్యుల సలహాలు మేలు చేస్తాయి. కొత్తవారిని నమ్మకండి. వివాదాలకు ఆస్కారం ఇవ్వకండి. దూర ప్రయాణాల్లో జాగ్రత్త. దత్తాత్రేయస్వామిని ఉపాసించండి.



తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

శుభాలు గోచరిస్తున్నాయి. లక్ష్యం నెరవేరే వరకూ ప్రశాంతంగా వ్యవహరించండి. ఉద్యోగంలో కలిసొస్తుంది. ప్రశంసలూ పురస్కారాలూ లభిస్తాయి. వ్యాపార జీవితంలో మంచి మలుపులు ఉన్నాయి. భాగ్య బృహస్పతి యోగం అదృష్టాన్ని ప్రసాదిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తగా ఉండాలి. పొదుపు-మదుపు అవసరం. లక్ష్మీ అష్టోత్తరం పఠించండి.



వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగంలో ఉత్తమ స్థితి గోచరిస్తోంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. భూలాభం ఉంది. మిత్రుల అండ లభిస్తుంది. కుటుంబ సభ్యులకు ఆనందాన్ని కలిగిస్తారు. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చిన్నపాటి నిర్లక్ష్యాలు పెద్ద ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఆస్కారం ఉంది. తగిన జాగ్రత్త అవసరం. విష్ణు సహస్రనామం పఠించండి.



ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

వృత్తి ఉద్యోగాల్లో మేలు జరుగుతుంది. ఏకాగ్రతతో కొత్త పనులు మొదలుపెట్టండి. కొన్ని ప్రయోజనాలు అందినట్టే అంది చేజారిపోతాయి. అయినా నిరాశ వద్దు. దైవబలం మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. నిర్ణయాల్ని వాయిదా వేయకండి. కొన్ని సందర్భాల్లో మౌనమే ఉత్తమం. ఆర్థిక ఫలితాలు అనుకూలం. సూర్యభగవానుడిని స్మరించండి.



మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆత్మశక్తి ముందుకు నడిపిస్తుంది. మీరు నమ్మిన ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది. కొత్త ప్రయత్నాలు విజయవంతం అవుతాయి. లక్ష్య సాధనకు అడ్డదార్లను ఎంచుకోకండి. పట్టుదలతో అవరోధాల్ని అధిగమించండి. క్లిష్టమైన సమస్యలకు మిత్రుల ద్వారా పరిష్కారం లభిస్తుంది. శనియోగం మిమ్మల్ని సదా కాపాడుతుంది. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

మిశ్రమ ఫలితాలు ఉన్నాయి. ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయండి. సున్నితమైన సమస్యలకు సకాలంలో స్పందించండి. మరింత మనోబలం అవసరం. కుటుంబ విషయాల్లో ఒత్తిడికి గురవుతారు. కొత్త ప్రయత్నాలకు తగిన సమయం కాదు. వృత్తి నైపుణ్యాల్ని పెంచుకోండి. పెద్దల పట్ల వినయవిధేయతలు అవసరం. విష్ణు సహస్రనామం పఠించండి.



మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఏకాగ్రతతో విజయాలు సాధిస్తారు. కాలం సహకరిస్తుంది. మీ చుట్టూ మేలు చేసేవారు ఉన్నారు. కొత్త ప్రయత్నాలు విజయవంతం అవుతాయి. ఆర్థిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. ఉద్యోగ జీవితం సంతృప్తికరంగా సాగుతుంది. ఆరో రాశిలో ఉన్న రవి ఆనందాన్ని ప్రసాదిస్తాడు. పెద్దల మన్ననలు అందుతాయి. వేంకటేశ్వరుడిని స్మరించండి.



పదకేళి

కూర్పు: బాలు

1		2	■	3	■	4	■	5		6	■
	■	7		■	8		9		■	10	11
12	13		■	14		■		■	15		
■		■	16			17	■	18	■		■
19	■	20			■	21				■	22
23	24			■	25		■		■	26	■
27			■	28		■	29	■	30		31
■		■	32		■	33		34		■	
35	■	36			37	■	38		■	39	
40		■		■	41	42	■	43	44		■
	■	45		46	■	47	48	■	49		
50			■	51					■		■

ఆధారాలు - అడ్డం

1. చంపకం (3)
3. అడ్డం 14తో కోతి (1)
5. ఒకదాని మీద మరొకటిగా పేర్చినవి (3)
7. ఉపాయం (2)
8. మల్లె వంటిదే- ఒక పూలతీగ (4)
10. మంత్ర పఠనం, ధ్యానం (2)
12. శివుడు (3)
14. వర్షం (2)
15. బాధ, దుఃఖం (3)
16. నవ్వు ధ్వనిని ఇలా వర్ణిస్తారు (4)
20. యమలోకం (3)
21. పుకార్లు (4)
22. అడ్డం మూడుతో ఒక అప్సరస (1)
23. రామచరితం (4)
25. పందెం (2)
27. తాడు వంటి వాటితో కట్టు, చిక్కు (3)
28. మట్టి (2)
30. కళ్ళకు పెట్టుకునే అంజనం (3)
32. సమానం; సమాప్తి (2)
33. ఓటమి (4)
36. పండుగ, శుభదినం (4)
38. పాక, కొట్టం; రెండొంతుల కుటిలం (2)
39. దేవుడు, ప్రభువు (2)
40. అతి నెమ్మది నడకకు మారుపేరు? (2)
41. రోజు (2)
43. గోచీ (3)
45. సంపూర్తిగా కాదు- కొంతమేరకు (3)
47. పగలు (2)
49. వెలుగు, కాంతి (3)
50. కొడుకులు (3)
51. పులి, బెబ్బులి (5)

ఆధారాలు - నిలువు

1. దేశం కాని దేశం (3)
2. ఆకాశమార్గాన వెళ్తూ నమిలిన తాంబూలాన్ని కృష్ణుడి చేతిలో పడేట్లు ఉమిసి ప్రాణాల పైకి తెచ్చుకున్నవాడు (3)
4. అంబలి (2)
5. చోరుడు (2)
6. వెండికొండ, కైలాసం (4)
8. సీతాదేవి (3)
9. దురద, కండూతి (2)
11. పంపేది లేదు (2)
13. భూమి (2)
14. వైఖరి, తీరు (3)
16. దీప్తి, రశ్మి (3)
17. ఉప్పు (3)
18. భర్త, చంద్రుడు (3)
19. గోము, మురిపెం (3)
20. కన్ను (3)
24. '..... మాసం' అంటే వైశాఖం (3)
25. దంతం (2)
26. దెబ్బ, ఘాతం (2)
28. భర్త తమ్ముడు (3)
29. కోపం, కినుక (3)
30. దేహం (2)
31. సంపద (3)
32. పరమాత్మ, సర్వాంతర్యామి (4)
34. క్లిష్టం, తీవ్రం (3)
35. ఒక నక్షత్రం (4)
37. శివయ్య వాహనం (2)
39. సమానుడు, తోటివాడు (4)
42. ఆడబిడ్డ (3)
44. నఖం (2)
45. క్షీరం (2)
46. పట్టుచీరలకు ప్రసిద్ధి (2)
48. వంకర, వక్రత (2)

సుడోకు

9								3
	6			3		9	4	7
	3	8		4				
	2	3	5			4		1
	7		2		3		6	
8		1			6	3	2	
				2		1	9	
1	5	7		9			3	
2								4

గతవారం సమాధానాలు

పదకేళి


1 చం	2 చ	న	■	3 శి	4 రో	జం	■	5 అ	6 రు	వు	■
7 దే	వి	■	8 రే	ఖ	లు	■	9 త	ర్జ	మా	■	10 డి
మా	■	11 న	వ	రం	■	12 శి	■	13 సు	లు	14 ము	■
15 త	ర	గ	తి	■	16 న	ర	17 కు	డు	■	18 కుం	భం
రం	■	టు	■	19 రా	క్ష	సు	డు	■	20 వ	దం	■
■	21 డి	■	22 ప	వి	త్రం	■	23 ము	క్కె	ర	■	24 త
25 స	హ	26 వా	సి	■	27 తో	28 క	లు	■	29 మే	ది	ని
త్య	■	ర	■	30 పై	■	ర	■	31 ష	ష్టి	■	ధీ
32 లో	33 క	మా	34 త	■	35 సం	కు	36 రా	త్రి	■	37 చం	■
38 కం	వ	■	39 పం	40 జ	రం	■	మ	■	41 పా	దు	షా
■	42 టు	బం	■	ల	■	43 సాం	బా	రు	■	రు	■
44 జో	డు	■	45 అ	జం	తా	■	ణం	■	46 గొ	డు	గు

సుడోకు

2	3	9	4	6	7	8	1	5
6	1	8	5	3	2	4	7	9
4	5	7	1	8	9	2	6	3
7	4	3	2	9	6	5	8	1
9	6	1	8	7	5	3	2	4
8	2	5	3	4	1	7	9	6
3	9	6	7	2	4	1	5	8
1	8	2	6	5	3	9	4	7
5	7	4	9	1	8	6	3	2


A B C D E F 1 2 3












పచ్చ బంగారు లోకం!



నాలుగు గోడల మధ్య ఉరుకులు పరుగుల జీవితంలో కాసేపు సేద తీరడానికి ప్రకృతి ఒడిలో రూపుదిద్దుకున్న రిసార్టులకు బయలుదేరుతుంటారు చాలామంది. కానీ థాయ్‌లాండ్‌లోని బాన్ రాక్ అనే గ్రామం మాత్రం పూర్తిగా ప్రకృతితోనే మమేకమై ఉంటుంది. ఎత్తయిన కొండలూ, వాటి మీద టీ తోటలూ, అందులో కొలువైన వరుస ఇళ్లూ, కింద సరస్సులూ, కొలనులతో చూడముచ్చటగా ఉంటుంది. ఆ అందమే ఈ ఊరిని ప్రత్యేకంగా నిలుపుతూ పర్యటకుల్ని 'రా రమ్మంటూ' ఆహ్వానిస్తోంది. థాయ్‌తోపాటు చైనీస్ సంప్రదాయాలూ, ఫుడ్‌వెరైటీలూ ఇక్కడ కనిపిస్తుంటాయి. ఆ రుచుల్ని ఆస్వాదిస్తూ, తోటల్లో తిరిగేస్తూ, పడవల్లో విహరిస్తూ గడిపేస్తుంటారు సందర్శకులెందరో. ఏది ఏమైనా... కొండల్లో, పచ్చటి చెట్ల మధ్య నెలకొన్న ఈ ఇళ్లను చూస్తుంటే 'గృహమే కదా స్వర్గసీమ' అన్నమాటకు అచ్చమైన ఉదాహరణల్లా అనిపించట్లేదూ!

అల్లంత దూరాన అందాల కోట, దాని ముందు వయ్యారంగా వంపులు తిరిగిన నదీ ప్రవాహంతో కనువిందు చేస్తున్న ఈ చిత్రం- జానపద కథల్లోని చక్కటి వర్ణనలా లేదూ! ఊహల్లోని రాజకుమారి కోటలా అనిపించే ఈ ప్రదేశాన్ని నిజంగా చూడాలంటే ఫ్రాన్స్‌కి వెళ్లాల్సిందే. అక్కడి 'మాంట్ శాన్ మీషెల్' పురాతన కట్టడం చుట్టూ నీళ్లతో అందమైన ద్వీపంలా దర్శనమిస్తుంది. సముద్రం అంచున ఉన్న ఈ నిర్మాణం పక్క నుంచీ కూయెనాన్ నది వంపులు తిరుగుతూ సముద్రంలో కలిసిపోతుంది. కోటతోపాటు ఆ దారుల అందాల్నీ ఆస్వాదించడానికి పర్యటకులు రాకుండా ఉంటారా మరి?

